TELANGANA RISING 2047

RNI.No. TELTEL/2010/32434

# అన్వేషణ నేత్రం

ఎడిటర్ : గోళ్ల రమేష్

తెలుగు దినపత్రిక

సంపుటి :12 సంచిక : 75 | గురువారం 16 జులై 2026 | హైదరాబాద్ | పేజీలు : 8 , రూ.1.00



సోనమ్ వాంగ్‌చుక్ ఆరోగ్యంపై

## దాఖలైన పిల్.. కేంద్రానికి ఢిల్లీ హైకోర్టు నోటీసులు..

2



నోయిడాలో భారీ

## అగ్ని ప్రమాదం.. ఇద్దరి మృతి

2



మమతా బెనర్జీకి మరో ఎదురుదెబ్బ..

## రెబల్ తృణమూల్ వర్గంలో చేరిన మదన్ మిత్ర

2



2

తుది దశకు అహ్మదాబాద్ విమాన

## ప్రమాద దర్యాప్తు: కేంద్రమంత్రి

అహ్మదాబాద్ ఎయిర్ ఇండియా విమాన ప్రమాద దర్యాప్తు తుది దశకు చేరిందని కేంద్ర పౌర విమానమాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు. అతి త్వరలోనే ఈ ప్రమాదానికి సంబంధించిన తుది నివేదిక వస్తోందని పేర్కొన్నారు. త్వరగా నివేదిక ఇవ్వడం కంటే.. ప్రమాదం అసలు నిజాన్ని బయటపెట్టడమే తమకు ముఖ్యమని తెలిపారు.



ఫ్యూచర్ సిటీకి స్టెప్పింగ్

# స్టోన్‌గా అమెజాన్ డేటా సెంటర్

- 2047 కల్లా 3 ట్రిలియన్ ఎకానమీకి చేరుకుంటాం
- భారత జీడీపీకి 10శాతం అందించడమే తమ లక్ష్యం
- కాలుష్య రహిత నగరంగా హైదరాబాద్
- నగరంలో ఉన్న పరిశ్రమలను బయటకు తరలిస్తాం
- మూసీ ప్రక్షాళన, మెట్రో విస్తరణ చేపట్టాం
- డీజిల్ నుంచి ఈవీలుగా బస్సులను మారుస్తాం
- ఈవీ వాహనాల రిజిస్ట్రేషన్‌లో జీరో ట్యాక్స్
- ఫార్చ్యూన్ కంపెనీలకుహబ్‌గా హైదరాబాద్
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

ఫ్యూచర్ సిటీలో అమెజాన్ కొత్త డేటా సెంటర్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. 2047 కల్లా 3 ట్రిలియన్ ఎకానమీకి చేరుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. భారత జీడీపీకి 10శాతం అందించడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. కాలుష్యరహిత నగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దుతామని చెప్పారు. నగరంలో ఉన్న పరిశ్రమలను బయటకు తరలిస్తామన్నారు. మూసీ ప్రక్షాళన, మెట్రో విస్తరణ చేపట్టామని, డీజిల్ నుంచి ఈవీలుగా బస్సులను మారుస్తామని వెల్లడించారు. ఈవీ వాహనాల రిజిస్ట్రేషన్‌లో జీరో ట్యాక్స్ అమలు చేస్తున్నామని అన్నారు.

వార్త 2లో





2

హసీనా వస్తే స్వాగతిస్తాం..

## కానీ ఉరిశిక్ష తప్పదు: బంగ్లాదేశ్ సంచలన వ్యాఖ్యలు!

బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా ఈ ఏడాది తన స్వదేశానికి తిరిగి వెళ్లిపోవడానికి ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఈ ఏడాది డిసెంబర్ నాటికి దేశానికి తిరిగి వెళ్లి 'అవామీ లీగ్' పార్టీని మళ్లీ బలోపేతం చేయాలని హసీనా భావిస్తున్నట్లు ఆమె సన్నిహిత వర్గాలు వెల్లడించాయి.

ఈనెలలోనే 50

## నామినేటెడ్ పోస్టుల భర్తీ..




ఈ నెలలోనే 50 నామినేటెడ్ పదవులను భర్తీ చేస్తామని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ప్రకటించారు. ఈరోజు(బుధవారం) మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో మాట్లాడుతూ.. గతంలో పనితీరు కనబరిచిన వారిని రెన్యూవల్ చేసే అవకాశం ఉందన్నారు. డీసీసీల పనితీరు బాగోలేకపోతే మార్చే అవకాశం ఉందని వెల్లడించారు.

వార్త 2లో

రూ. 2.19 లక్షల కోట్ల విలువైన 7 కీలక

## ప్రాజెక్టులకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం



భారతదేశ పారిశ్రామిక, మౌలిక సదుపాయాల రంగాలను మరింత బలోపేతం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం ఇవాళ (బుధవారం) అత్యంత కీలకమైన నిర్ణయాలు తీసుకుంది. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర క్యాబినెట్ సమావేశంలో మొత్తం రూ. 2,19,353 కోట్ల విలువైన ఏడు భారీ ప్రాజెక్టులకు ఆమోదం లభించింది.

వార్త 2లో

మహిళా శిశు

## సంక్షేమ శాఖ అధికారులతో మంత్రి సీతక్క కీలక సమీక్ష

మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులతో మంత్రి సీతక్క ఈరోజు(బుధవారం) సచివాలయంలో కీలక సమీక్ష నిర్వహించారు. అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల పురోగతిపై సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల్లో గుడ్లు, పప్పు సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు.



2

## గ్యాస్ రీఫిల్లింగ్ చేస్తుండగా పేలుడు.. ఐదుగురికి గాయాలు

జిల్లాలోని మనోహరాబాద్ మండల కేంద్రంలోని పరికిబండలో ప్రమాదం జరిగింది. డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్ నుంచి కమర్షియల్ సిలిండర్‌లోకి గ్యాస్ రీఫిల్లింగ్ చేస్తుండగా పేలుడు సంభవించింది. ప్రమాద తీవ్రతకు గదిలోని వస్తువులన్నీ కాలి బూడిదయ్యాయి. పేలుడు శబ్దానికి స్థానికులు తీవ్ర భయాందోళనకు గురై పరుగులు తీశారు.



2

# సోనమ్ వాంగ్‌చుక్ ఆరోగ్యంపై దాఖలైన పిల్.. కేంద్రానికి ఢిల్లీ హైకోర్టు నోటీసులు..

హైదరాబాద్, అన్వేషనేత్రం ప్రతినిధి

సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ ఆరోగ్యం క్షీణిస్తున్న నేపథ్యంలో దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై ఢిల్లీ హైకోర్టు స్పందించింది. వాంగ్‌చుక్ ఆరోగ్య పరిస్థితిని అత్యంత తీవ్రంగా పరిగణించిన న్యాయస్థానం.. కేంద్రానికి, ఢిల్లీ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. ఆయనకు ఇప్పటివరకు అందించిన వైద్య సహాయం, తీసుకున్న చర్యలపై సమాధానం ఇవ్వాలని ఆదేశించింది.సోనమ్ వాంగ్‌చుక్ ప్రస్తుతం ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిరవధిక నిరాహార దీక్ష కొనసాగిస్తున్నారు. ఆయన ఆరోగ్యం వేగంగా క్షీణిస్తోందని, ఇప్పటికే సుమారు 8.5 కిలోల బరువు తగ్గారని, పరిస్థితి మరింత విషమించే ప్రమాదం ఉందని పిల్ దాఖలైంది. ఆయన ప్రాణాలను కాపాడేందుకు అవసరమైతే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించాలని, అవసరమైతే ద్రవాహారం అందించేలా చర్యలు తీసుకోవాలని కోర్టును పిటిషనర్ కోరారు.ఈ అంశాన్ని అత్యవసరంగా విచారించిన హైకోర్టు, వాంగ్‌చుక్ ఆరోగ్య పరిస్థితిపై ఏ చర్యలు తీసుకున్నారో వివరించాలని కేంద్రాన్ని, ఢిల్లీ ప్రభుత్వాన్ని ఆదేశించింది . అలాగే ఆయనకు తక్షణ వైద్య సాయం అందించేందుకు అధికారులు తీసుకుంటున్న చర్యలపై కూడా వివరణ కోరింది. విద్యా వ్యవస్థలో జరిగిన అవకతవకలపై జరుగుతున్న కాక్రోచ్ జనతా పార్టీ ఉద్యమానికి మద్దతుగా వాంగ్‌చుక్ నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్నారు.

# నోయిడాలో భారీ అగ్నిప్రమాదం.. ఇద్దరి మృతి

నోయిడా, అన్వేషనేత్రం ప్రతినిధి

నోయిడాలోని మామురా గ్రామంలో బుధవారం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారని పోలీస్ ఉన్నతాధికారి వెల్లడించారు. 50 కుటుంబాలను రక్షించినట్లు తెలిపారు. ఎలక్ట్రిక్ బైక్‌లో చెలరేగిన నిప్పురవ్వలే ఈ ప్రమాదానికి కారణమని చెప్పారు. సహాయక చర్యలు కొనసాగుతున్నాయని వివరించారు. ఈ ప్రమాదంపై ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ ఆరా తీశారు. సహాయక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.ఈ అగ్నిప్రమాదంపై తమకు సమాచారం అందిన వెంటనే ఏడు అగ్నిమాపక వాహనాలతోపాటు సిబ్బంది ఘటన స్థలానికి చేరుకున్నారని జాయింట్ కమిషనర్ రాజీవ్ నారాయణ్ వెల్లడించారు. ఎగిసిపడుతున్న మంటలను అదుపులోకి తీసుకొచ్చేందుకు సిబ్బంది శ్రమిస్తున్నారని తెలిపారు. ఈ అగ్నిప్రమాదం వల్ల భారీగా పొగ వ్యాపించడంతో.. ఇద్దరు వ్యక్తులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారని అన్నారు. వారిని వెంటనే సమీపంలోని ఆసుపత్రికి తరలించినట్లు పేర్కొన్నారు. వారి పరిస్థితి విషమంగా ఉందని చెప్పారు. ఈ ప్రమాదం జరిగిన భవనంలో బేస్‌మెంట్‌లో కాకుండా.. గ్రౌండ్ ఫ్లోర్‌లో వాహనాల పార్కింగ్ ఉందని వివరించారు. ఆ ప్రాంతం నుంచి పొగ పైకి వ్యాపించి.. ఆ భవనంలో నివసిస్తున్న వారిపై ప్రభావం చూపిందని పోలీస్ జాయింట్ కమిషనర్ తెలిపారు.

# మమతా బెనర్జీకి మరో ఎదురుదెబ్బ.. రెబల్ తృణమూల్ వర్గంలో చేరిన మదన్ మిత్ర

కోల్‌కతా, అన్వేషనేత్రం ప్రతినిధి

పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో మరో పెను సంచలనం నమోదైంది. మాజీ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ (ుఎీజ) అధినేత్రి మమతా బెనర్జీకి కోలుకోలేని విధంగా గట్టి షాక్ తగిలింది. టీఎంసీలో కీలక నేత, మమతా బెనర్జీకి అత్యంత సన్నిహితుడిగా పేరుగాంచిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే మదన్ మిత్ర పార్టీకి గుడ్‌బై చెప్పారు. రీతాబ్రతా బెనర్జీ నేతృత్వంలోని తిరుగుబాటు టీఎంసీ వర్గంలో ఆయన చేరడం బెంగాల్ రాజకీయ వర్గాల్లో తీవ్ర కలకలం రేపుతోంది. వన్‌మ్యాన్ షోగా మారిన తృణమూల్.. మదన్ మిత్ర సంచలన వ్యాఖ్యలు కమర్హాతి నియోజకవర్గ ఎమ్మెల్యే మదన్ మిత్ర పార్టీని వీడుతూ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు బెంగాల్ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. మమతా బెనర్జీ మేనల్లుడు అభిషేక్ బెనర్జీ లక్ష్యంగా ఆయన తీవ్ర విమర్శలు గుప్పించారు. 'పార్టీ నాశనమైపోతోంది.. పడవ మునిగిపోతోంది. ప్రజలు చనిపోతున్నారు. అయినా సరే, అభిషేక్ బెనర్జీని ఎలాగైనా కాపాడుకోవాలనే ధోరణిలోనే పార్టీ నిర్ణయాలు ఉన్నాయి. అభిషేక్ కనీసం ఆరు నెలలు లేదా ఏడాది పాటు పక్కకు తప్పుకోవాలని, పార్టీని మేము నిర్మిస్తామని స్వయంగా ఆయనకే సూచించాను. కానీ ఆయన దానికి నిరాకరించారు. పార్టీ అందరిదీ కాకుండా.. కేవలం అభిషేక్ బెనర్జీ చుట్టూనే తిరుగుతోంది.' అంటూ మదన్ మిత్ర సంచలన ఆరోపణలు గుప్పించారు.

# తుది దశకు అహ్మదాబాద్ విమాన ప్రమాద దర్యాప్తు: కేంద్రమంత్రి

ఢిల్లీ, అన్వేషనేత్రం ప్రతినిధి

అహ్మదాబాద్ ఎయిర్ ఇండియా విమాన ప్రమాద దర్యాప్తు తుది దశకు చేరిందని కేంద్ర పౌర విమానమాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు. అతి త్వరలోనే ఈ ప్రమాదానికి సంబంధించిన తుది నివేదిక వస్తోందని పేర్కొన్నారు. త్వరగా నివేదిక ఇవ్వడం కంటే.. ప్రమాదం అసలు నిజాన్ని బయటపెట్టడమే తమకు ముఖ్యమని తెలిపారు. ఈ ఘటనపై దర్యాప్తు బృందం ఇచ్చిన నివేదికపై పూర్తి విశ్వాసం వ్యక్తం చేస్తున్నట్లు చెప్పుకొచ్చారు. గతేడాది జూన్ 12వ తేదీన అహ్మదాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో ఎయిర్ ఇండియా ఞూ×-171 బోయింగ్ విమానం కుప్పకూలిన విషయం తెలిసిందే.ఈ ప్రమాదంలో 229 మంది ప్రయాణికులు, 12 మంది సిబ్బందితో పాటు భూమిపై ఉన్న 19 మంది.. మొత్తం 260 మంది మృతిచెందారు. ఈ ఘటనలో విమాన వ్యవస్థలు, బ్లాక్ బాక్స్ డేటా, ఇంజిన్ భాగాల విశ్లేషణలో ఞూఞూ×దీ కీలక పురోగతి సాధించింది. పౌర విమానయాన శాఖకు ఐదు ప్రధాన డిమాండ్లతో బాధితుల కుటుంబ సభ్యులు లేఖలు రాశారు. ఫైనల్ రిపోర్ట్ ఇచ్చే ముందు స్వతంత్ర 'ఫుల్ ఫ్లైట్ సిమ్యులేటర్ వాలిడేషన్ టెస్టులు' నిర్వహించాలని డిమాండ్ చేశారు. దర్యాప్తు పురోగతిపై ప్రతి 15 లేదా 30 రోజులకు ఒకసారి కుటుంబాలకు అధికారికంగా సమాచారం అందించాలని అధికారులకు కేంద్రమంత్రి సూచించారు.ఈ కేసు విచారణ బృందంలో బోయింగ్ 787 నడిపిన అనుభవం ఉన్న సీనియర్ కమర్షియల్ పైలట్‌ను చేర్చాలని బాధితులు విజ్ఞప్తి చేశారు. భవిష్యత్తు చట్టపరమైన హక్కులను కోల్పోయేలా బాధితులపై ఎలాంటి బలవంతపు ఒప్పందాల సంతకాలు చేయించవద్దని అధికారులను కేంద్రమంత్రి ఆదేశించారు. ఈ ఘటనపై తుది నివేదిక విడుదలకు ఓ కచ్చితమైన కాలపరిమితిని ప్రకటించాలని కుటుంబ సభ్యులు కోరారు. బాధితుల కుటుంబ సభ్యుల లేఖపై కేంద్రమంత్రి స్పందించారు. అంతర్జాతీయ దర్యాప్తు నిబంధనల ప్రకారమే విచారణ వేగంగా సాగుతోందని కేంద్రమంత్రి రామ్మోహన్ స్పష్టం చేశారు.

# ఫ్యూచర్ సిటీకి స్టెప్పింగ్ స్టోన్‌గా అమెజాన్ డేటా సెంటర్

- 2047 కల్లా 3 ట్రిలియన్ ఎకానమీకి చేరుకుంటాం
- భారత జీడీపీకి 10శాతం అందించడమే తమ లక్ష్యం
- కాలుష్యరహిత నగరంగా హైదరాబాద్
- నగరంలో ఉన్న పరిశ్రమలను బయటకు తరలిస్తాం
- మూసీ ప్రక్షాళన, మెట్రో విస్తరణ చేపట్టాం
- డీజిల్ నుంచి ఈవీలుగా బస్సులను మారుస్తాం
- ఈవీ వాహనాల రిజిస్ట్రేషన్‌లో జీరో ట్యాక్స్
- ఫార్చ్యూన్ కంపెనీలకు హబ్‌గా హైదరాబాద్



## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హైదరాబాద్, అన్వేషనేత్రం ప్రతినిధి

ఫ్యూచర్ సిటీలో అమెజాన్ కొత్త డేటా సెంటర్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. 2047 కల్లా 3 ట్రిలియన్ ఎకానమీకి చేరుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. భారత జీడీపీకి 10శాతం అందించడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. కాలుష్యరహిత నగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దుతామని చెప్పారు. నగరంలో ఉన్న పరిశ్రమలను బయటకు తరలిస్తామన్నారు. మూసీ ప్రక్షాళన, మెట్రో విస్తరణ చేపట్టామని, డీజిల్ నుంచి ఈవీలుగా బస్సులను మారుస్తామని వెల్లడించారు. ఈవీ వాహనాల రిజిస్ట్రేషన్‌లో జీరో ట్యాక్స్ అమలు చేస్తున్నామని అన్నారు. ఫార్చ్యూన్ కంపెనీలకు హబ్‌గా హైదరాబాద్ మారనుందని, ప్రపంచంలోనే అత్యంత అధునాతనమైన నగరాన్ని నిర్మిస్తున్నామని వెల్లడించారు. పరిశ్రమలకు సింగిల్ విండో ద్వారా అనుమతులు ఇస్తున్నామని, పారిశ్రామి కవేత్తలకు అనేక రకాల ప్రోత్సాహకాలు అందిస్తున్నామని సీఎం చెప్పుకొచ్చారు. ప్రతి రంగానికి ప్రత్యేక పాలసీలు రూపొందించామని తెలిపారు. పాలసీలపై ఎప్పటికప్పుడు రివ్యూలు నిర్వహిస్తున్నామన్నారు. ఫ్యూచర్ సిటీకి అమెజాన్ డేటా సెంటర్ స్టెప్పింగ్ స్టోన్‌గా ఉంటుందన్నారు. ఫ్యూచర్ సిటీకి రాబోయే రోజుల్లో మరిన్ని పెట్టుబడులు రానున్నాయని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. కాగా, ఫ్యూచర్ సిటీలో 202 ఎకరాల్లో అమెజాన్ డేటా సెంటర్ నిర్మాణం జరగనుంది.12 ఏళ్లలో రూ.60వేల కోట్లను అమెజాన్ వెచ్చించనుంది. ఈ కార్యక్రమంలో మంత్రులు శ్రీధర్ బాబు, జూపల్లి కృష్ణా రావు, వాకిటి శ్రీహరి, శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సలహాదారు రామకృష్ణా రావు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఈనెలలోనే 50 నామినేటెడ్ పోస్టుల భర్తీ..

## మహేశ్ గౌడ్ కీలక ప్రకటన

హైదరాబాద్, అన్వేషనేత్రం ప్రతినిధి

ఈ నెలలోనే 50 నామినేటెడ్ పదవులను భర్తీ చేస్తామని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ప్రకటించారు. ఈరోజు(బుధవారం) మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో మాట్లాడుతూ.. గతంలో పనితీరు కనబరిచిన వారిని రెన్యూవల్ చేసే అవకాశం ఉందన్నారు. డీసీసీల పనితీరు బాగోలేకపోతే మార్చే అవకాశం ఉందని వెల్లడించారు. పార్టీ పదవులపై మీనాక్షి నటరాజన్‌తో చర్చించామని తెలిపారు. రెండు రోజుల్లో సీఎం రేవంత్‌రెడ్డితో భేటీ అవుతామన్నారు. రెన్యువల్ విషయంలో ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని చెప్పారు. మండల కమిటీలో డీసీసీల రిపోర్ట్ ఫైనల్ అని స్పష్టం చేశారు.ఎంపీ రేణుకా చౌదరితో మాట్లాడానని మహేశ్ తెలిపారు. 'తాను మాట్లాడిన ఉద్దేశం వేరని నాతో అన్నారు. ఖమ్మంలో బీజేపీ, బీఆర్ఎస్ రెండూ కూడా కాంగ్రెస్ వైపు చూస్తున్నాయని అన్నట్లు రేణుక నాతో చెప్పారు.. కానీ ఆ వ్యాఖ్యలపై దుష్ప్రచారం చేశారు' అని తెలిపారు. కూనంనేని మిత్రపక్షం అయినప్పటికీ అక్కడ కాంగ్రెస్ క్యాడర్ కూడా ఉందన్నారు. దానిని కాపాడుకునే ప్రయత్నంలో ఎంపీ రఘురాం రెడ్డి మాట్లాడి ఉంటారని చెప్పుకొచ్చారు. కూనంనేనితో తమకెలాంటి విభేదాలూ లేవన్నారు. స్థానికంగా ఉన్న సమస్యలను స్థానికంగానే పరిష్కరించుకోవాలని చెప్పారు. ప్రతి చిన్న విషయానికీ గాంధీభవన్ రావటం మానుకోవాలని క్యాడర్‌కు సూచించారు. నలుగురు ఐదుగురు మినహా అందరు డీసీసీ అధ్యక్షుల పనితీరు బాగుందని మహేశ్ గౌడ్ కితాబిచ్చారు.

# మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులతో మంత్రి సీతక్క కీలక సమీక్ష

హైదరాబాద్, అన్వేషనేత్రం ప్రతినిధి

మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులతో మంత్రి సీతక్క ఈరోజు(బుధవారం) సచివాలయంలో కీలక సమీక్ష నిర్వహించారు. అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల పురోగతిపై సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల్లో గుడ్లు, పప్పు సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. అంగన్‌వాడీ భవనాల నిర్మాణ పురోగతిని వేగవంతం చేయాలని ఆదేశించారు. టేక్ హోమ్ రేషన్ (ుఎ=) పంపిణీలో వేగం పెంచాలని సూచించారు. గర్భిణీలు, బాలింతలు, 3 నుంచి 6 ఏళ్ల చిన్నారుల హాజరును పెంచేలా చర్యలు చేపట్టాలన్నారు.అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనపై అధికారులకు మంత్రి దిశానిర్దేశం చేశారు. పలు పథకాల కింద బడ్జెట్ విడుదల, వ్యయంపై జిల్లాల వారీగా పనితీరును పరిశీలించారు. అంగన్వాడీ 'తొలిముద్ద' కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులకు మంత్రి సీతక్క ఆదేశాలు జారీ చేశారు.

# గ్యాస్ రీఫిల్లింగ్ చేస్తుండగా పేలుడు.. ఐదుగురికి గాయాలు

మెదక్,

జిల్లాలోని మనోహరాబాద్ మండల కేంద్రంలోని పరికిబండలో ప్రమాదం జరిగింది. డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్ నుంచి కమర్షియల్ సిలిండర్‌లోకి గ్యాస్ రీఫిల్లింగ్ చేస్తుండగా పేలుడు సంభవించింది. ప్రమాద తీవ్రతకు గదిలోని వస్తువులన్నీ కాలి బూడిదయ్యాయి. పేలుడు శబ్దానికి స్థానికులు తీవ్ర భయాందోళనకు గురై పరుగులు తీశారు. ఈ ప్రమాదంలో ఐదుగురు బీహార్‌కు చెందిన వలస కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. వారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు చెబుతున్నారు. గాయపడిన వారు రాజేష్, గంగారాం, సంజీవ్, లాలాన్, దబల్ నాథ్‌గా గుర్తించారు.నిన్న(మంగళవారం) రాత్రి ఈ ప్రమాదం జరిగింది. అయితే వంట చేస్తుండగా గ్యాస్ పేలిందంటూ నమ్మించేందుకు అక్కడి వారు ప్రయత్నించారు. ఈరోజు ఉదయం పోలీసులు వెళ్లి చూడగా అసలు విషయం బయటపడింది.

# హసీనా వస్తే స్వాగతిస్తాం.. కానీ ఉరిశిక్ష తప్పదు: బంగ్లాదేశ్ సంచలన వ్యాఖ్యలు!

ఇంటర్‌నెట్ డెస్క్: అన్వేషనేత్రం ప్రతినిధి

బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా ఈ ఏడాది తన స్వదేశానికి తిరిగి వెళ్లిపోవడానికి ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఈ ఏడాది డిసెంబర్ నాటికి దేశానికి తిరిగి వెళ్లి 'అవామీ లీగ్' పార్టీని మళ్లీ బలోపేతం చేయాలని హసీనా భావిస్తున్నట్లు ఆమె సన్నిహిత వర్గాలు వెల్లడించాయి. షేక్ హసీనా బంగ్లాదేశ్‌కు తిరిగి వెళ్లటంపై ఆ దేశ ప్రధాని తారిఖ్ రెహమాన్ అడ్వైజర్ జహీద్ ఉర్ రెహమాన్ స్పందించారు. షేక్ హసీనా నిర్ణయాన్ని ఆయన స్వాగతించారు. బంగ్లాదేశ్‌కు వస్తే ఉరి శిక్ష తప్పదని స్పష్టం చేశారు.మంగళవారం ఆయన మీడియా ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతూ... 'హసీనా రాకను స్వాగతిస్తున్నాం. ఆమెను ఉరి తీయాలని ప్రజలు కోరుకుంటున్నారు. ఉరి శిక్షను ఆపడానికి హసీనా ప్రపంచంలోనే అత్యుత్తమ న్యాయవాదులను ఢాకాకు రప్పించుకోవచ్చు. బంగ్లాదేశ్ ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రిబ్యునల్ (×జు-దీణ)లో జరిగే విచారణ అత్యంత పారదర్శకంగా ఉంటుంది. దీన్ని అంతర్జాతీయ పరిశీలకులు కూడా పర్యవేక్షించవచ్చు. కోర్టులో సరైన వాదనలు జరిగితే గతంలో హసీనాకు పడిన ఉరిశిక్ష తీర్పును సవరించే అవకాశం ఉంది. ఆమె నిర్దోషిగా కూడా విడుదల కావచ్చు' అని ఆయన పేర్కొన్నారు.

# ఎక్మో ( ఈ సి ఎం ఓ ) విధానంతో ఊపిరితిత్తుల చికిత్సలో సరికొత్త విప్లవం!

**చివరిదశ ఊపిరితిత్తుల వైఫల్యానికి అత్యంత అధునాతన వైద్యం అందుబాటులోకి**

**యశోద హాస్పిటల్స్ పల్మనాలజిస్ట్ డాక్టర్ తపస్వి కృష్ణ వెల్లడి**

సూర్యాపేట జిల్లా ప్రతినిధి జులై :15 ( అన్వేషనేత్రం ):

తీవ్రమైన శ్వాసకోశ సమస్యలతో, ఊపిరితిత్తులు పూర్తిగా దెబ్బతిని ప్రాణాపాయ స్థితికి చేరుకునే రోగులను కాపాడటంలో ఎక్మో కృత్రిమ గుండె-ఊపిరితిత్తుల పరికరం విధానం ఒక సంజీవనిలా మారుతోందని హైదరాబాద్ సోమాజిగూడ యశోద హాస్పిటల్స్ కన్సల్టెంట్ ట్రాన్స్‌ప్లాంట్ పల్మనాలజిస్ట్ డాక్టర్ తపస్వి కృష్ణ కాత్రగడ్డ తెలిపారు. ఈరోజు ఏర్పాటు చేసిన ప్రత్యేక విలేఖరుల సమావేశంలో ఆమె ఈ అత్యంత సంక్లిష్టమైన వైద్య విధానం ఈసీమో సపోర్ట్ విత్ లంగ్ ట్రాన్సప్లాంటేషన్ యొక్క విశిష్టతను మరియు మౌలిక సదుపాయాల వివరాలను వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని రోగులకు అంతర్జాతీయ స్థాయి క్రిటికల్ కేర్ వైద్య సదుపాయాలు ఏ విధంగా అందుబాటులోకి వచ్చాయో వివరించడానికి, చివరి దశ ఊపిరితిత్తుల వ్యాధిగ్రస్తుల్లో భరోసా నింపడానికి ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు ఆమె పేర్కొన్నారు ప్రాణం నిలిపే ఎక్మో కృత్రిమ శ్వాస వ్యవస్థ విధానం: చివరి దశ 'ఇంటర్‌స్టీషియల్ లంగ్ డిసీజ్' ఐ ఎల్ డి లేదా శ్వాసకోశ వైఫల్యం వల్ల ఊపిరితిత్తులు రక్తానికి ఆక్సిజన్‌ను అందించే సామర్థ్యాన్ని పూర్తిగా కోల్పోయినప్పుడు ఈ వెనో-వీనస్ ఎక్మో ఈ సి ఎం ఓ లైఫ్ సపోర్ట్ విధానాన్ని ఉపయోగిస్తామని. ఈ విధానంలో అత్యాధునిక యంత్రం శరీరం వెలుపల ఉంటూ కృత్రిమ ఊపిరితిత్తుల వ్యవస్థలా పనిచేస్తుంది. ఇది శరీరం నుండి ఆక్సిజన్ లేని చెడు రక్తాన్ని గ్రహించి, దానికి పూర్తి ఆక్సిజన్‌ను అందించి, కార్బన్ డయాక్సైడ్‌ను తొలగించి మళ్లీ శరీరంలోకి పంపుతుంది. ఊపిరితిత్తుల మార్పిడి అవసరమైన రోగులకు, దాత దొరికేవరకు బ్రిడ్జ్ టు ట్రాన్సప్లంట్ ప్రాణాలను నిలిపి ఉంచడానికి ఈ సాంకేతిక విధానం అత్యంత కీలకమైనదని డాక్టర్ తపస్వి వివరించారు.



సెకన్ల సమన్వయంతో సాగే అవయవ మార్పిడి: ఈ ఎక్మో విధానంలో ఉన్న రోగులకు ఊపిరితిత్తుల మార్పిడి డబల్ లంగ్ ట్రాన్సప్లంట్ చేయడం వైద్యశాస్త్రంలోనే అత్యంత సంక్లిష్టమైన ప్రక్రియ. రక్తం గడ్డకట్టడం, అధిక రక్తస్రావం వంటి తీవ్రమైన సాంకేతిక ప్రమాదాలను అధిగమిస్తూ.. గుండె-ఊపిరితిత్తుల నిపుణులు, అనస్థీషియా వైద్యులు, ఐసీయూ నర్సింగ్ బృందం సెకన్ల సమన్వయంతో వ్యవహరించి ఈ సుదీర్ఘ శస్త్రచికిత్స ప్రక్రియను విజయవంతం చేయాల్సి ఉంటుందని. ఊపిరితిత్తుల వ్యాధి చివరి దశకు చేరినంత మాత్రాన ఆశలు వదులుకోవాల్సిన అవసరం లేదని, ఎక్మో వంటి అధునాతన మౌలిక సదుపాయాలతో కూడిన వైద్య విధానం ద్వారా ప్రాణాలు నిలపడం సాధ్యమేనని స్పష్టం చేశారు. విజయవంతమైన రికవరీ విధానం: శస్త్రచికిత్స అనంతరం అందించే ప్రత్యేక అంతర్జాతీయ క్రిటికల్ కేర్ ప్రోటోకాల్స్ ద్వారా రోగులను ఎక్మో యంత్రం మరియు వెంటిలేటర్ల నుండి సురక్షితంగా తొలగించి, కొత్త ఊపిరితిత్తులతో స్వయంగా శ్వాస తీసుకునేలా చేస్తామని. ఆ తర్వాత క్రియాశీల శారీరక వ్యాయామాల ప్రక్రియ రిహాబిలిటేషన్ ద్వారా రోగులు సాధారణ జీవితాన్ని గడిపేలా ఈ చికిత్సా విధానం తోడ్పడుతుందని డాక్టర్ తపస్వి వివరించారు. ఈ విలేఖరుల సమావేశంలో యశోద హాస్పిటల్స్ మార్కెటింగ్ విభాగం సీనియర్ మేనేజర్ పరమేష్, మేనేజర్ ఉమేష్ మరియు అసిస్టెంట్ మేనేజర్ రాంప్రకాష్ మరియు ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

# నకిరేకల్ పోలీస్ స్టేషన్‌లో ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆకస్మిక తనిఖీ

**నల్లగొండ, జులై 15 (అన్వేషనేత్రం ప్రతినిధి):**





నల్గొండ జిల్లా నకిరేకల్ పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని రికార్డులు, కేసుల దర్యాప్తు వివరాలు, పెండింగ్ కేసుల స్థితి, స్టేషన్ నిర్వహణ తీరును పరిశీలించారు. అలాగే సిబ్బంది హాజరు, సీసీ కెమెరాల పనితీరును సమీక్షించారు. నమోదైన కేసుల దర్యాప్తులో పురోగతి సాధించాలని, పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించి బాధితులకు సకాలంలో న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ అధికారులను ఆదేశించారు. నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలని సూచించారు. రౌడీ షీటర్లు, పాత నేరస్థులు, బెయిల్‌పై విడుదలైన నిందితుల కదలికలపై నిరంతర నిఘా కొనసాగించాలని తెలిపారు. అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల తనిఖీలను ముమ్మరం చేయడంతో పాటు పట్టణాలు, గ్రామాల్లో రాత్రి గస్తీని మరింత బలోపేతం చేయాలని ఆదేశించారు. ఆన్‌లైన్ మోసాలు, సైబర్ నేరాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని ఎస్పీ సూచించారు. ఇలాంటి నేరాలకు సంబంధించి ఫిర్యాదులు అందిన వెంటనే స్పందించి బాధితులకు అవసరమైన సహాయం అందించాలని పేర్కొన్నారు. ప్రజల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదును గౌరవంగా స్వీకరించి, చట్ట ప్రకారం వేగవంతమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. పోలీస్ స్టేషన్ పరిశుభ్రత, రికార్డుల నిర్వహణ, సిబ్బంది క్రమశిక్షణపై ఎస్పీ ప్రత్యేక దృష్టి సారించారు. ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ పోలీస్ సేవలను మరింత చేరువ చేయాలని సూచించారు. అనంతరం స్టేషన్ సిబ్బందితో సమావేశమైన ఎస్పీ, శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, బాధితులకు సత్వర న్యాయం అందించడం పోలీసుల ప్రధాన కర్తవ్యమని అన్నారు. ప్రజల్లో పోలీసులపై నమ్మకాన్ని మరింత పెంచేలా ప్రతి అధికారి బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు.

# గౌరవ మైనారిటీల సంక్షేమ శాఖ మంత్రి శ్రీ మహమ్మద్ అజహరుద్దీన్ దూరదృష్టితో మైనారిటీ బాలికల భవిష్యత్తుకు బలమైన పునాది

**నాలుగు టీజీఎంఆర్ఈఐఎస్ జూనియర్ కళాశాలల నుంచి 120 మంది విద్యార్థినులతో కెరీర్ రెడీనెస్ బూట్‌క్యాంప్ విజయవంతంగా ముగింపురాష్ట్రంలోని 98 టీజీఎంఆర్ఈఐఎస్ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న 15,520 మందికి పైగా మైనారిటీ బాలికలకు విస్తరించనున్న కార్యక్రమం**



హైదరాబాద్ । జూలై 15, 2026

మైనారిటీ బాలికలను ఉన్నత విద్య, ఉపాధి, స్వయం ఉపాధి, నాయకత్వ రంగాల్లో రాణించేలా తీర్చిదిద్దే లక్ష్యంతో తెలంగాణ మైనారిటీస్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ టీజీఎంరేస్ గౌరవ మైనారిటీల సంక్షేమ శాఖ మంత్రి శ్రీ



మహమ్మద్ అజహరుద్దీన్ నాయకత్వంలో లంచ్ గర్ల్స్ సంస్థతో భాగస్వామ్యంగా నిర్వహించిన ఐదు రోజుల కెరీర్ రెడీనెస్ బూట్‌క్యాంప్ విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో టీజీఎంఆర్ఈఐఎస్‌కు చెందిన నాలుగు జూనియర్ కళాశాలల నుండి ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న 120 మంది విద్యార్థినులు పాల్గొన్నారు. ఉన్నత విద్య, ఉపాధి, స్వయం ఉపాధి మరియు నాయకత్వ అవకాశాలకు సిద్ధం చేసేలా ప్రత్యేక శిక్షణ అందించారు. ఈ బూట్‌క్యాంప్‌లో నాయకత్వ లక్షణాలు, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, ఆత్మవిశ్వాసం, జట్టు భావన, సమస్యల పరిష్కారం, ఆర్థిక అవగాహన, కెరీర్ ప్రణాళిక, డిజైన్ థింకింగ్, వ్యక్తిత్వ వికాసం, ప్రొఫెషనల్ ప్రజెంటేషన్ వంటి అంశాలపై కార్యాచరణ ఆధారిత శిక్షణ అందించబడింది. ఈ పైలట్ కార్యక్రమం టీజీఎంఆర్ఈఐఎస్‌కు ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచింది. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 98 బాలికల రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలల ద్వారా 15,520 మందికి పైగా మైనారిటీ బాలికలకు నాణ్యమైన విద్య అందిస్తోంది. ఈ కార్యక్రమం ద్వారా పొందిన అనుభవం, ఫలితాల ఆధారంగా భవిష్యత్తులో టీజీఎంఆర్ఈఐఎస్ పరిధిలోని అన్ని జూనియర్ కళాశాలలకు కెరీర్ రెడీనెస్ కార్యక్రమాలను విస్తరించేందుకు ప్రణాళికలు రూపొందించబడుతున్నాయి. లాంచ్ గర్ల్స్ ముఖ్య కార్యనిర్వాహణ అధికారి శ్రీమతి నేహా సాహు మాట్లాడుతూ, మైనారిటీ బాలికల్లో ఆత్మవిశ్వాసం, నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలు పెంపొందించి ఉన్నత విద్య, ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునేలా ఈ కార్యక్రమం దోహదపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి మైనారిటీల సంక్షేమ శాఖ మరియు టీజీఎంఆర్ఈఐఎస్ అందించిన సహకారాన్ని ఆమె అభినందించారు. ఆతిథ్య కళాశాల ప్రిన్సిపాల్ ఈ బూట్‌క్యాంప్ విద్యార్థినుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి, భవిష్యత్ జీవితానికి అవసరమైన నైపుణ్యాలను అందించిన విశిష్ట కార్యక్రమమని పేర్కొన్నారు. పాల్గొన్న విద్యార్థినులు కూడా ఈ కార్యక్రమం ద్వారా కమ్యూనికేషన్, నాయకత్వం, ఆర్థిక నిర్వహణ, కెరీర్ ప్రణాళిక వంటి అనేక కీలక నైపుణ్యాలు అభివృద్ధి చెందాయని తెలిపారు. లాంచ్ గర్ల్స్ సంస్థ, మైనారిటీ బాలికల విద్యా మరియు ఆర్థిక సాధికారతకు కట్టుబడి దూరదృష్టితో నాయకత్వం వహిస్తున్న గౌరవ మంత్రి శ్రీ మహమ్మద్ అజహరుద్దీన్ గారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది. అలాగే టీజీఎంఆర్ఈఐఎస్ అధ్యక్షులు శ్రీ మహమ్మద్ ఫహీముద్దీన్ ఖురేషీ గారు, కార్యదర్శి శ్రీ బి. షఫీయుల్లా, ఐఎఫ్ఎస్ గారి మార్గదర్శకత్వానికి కృతజ్ఞతలు తెలియజేసింది. గౌరవ ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో, గౌరవ మైనారిటీల సంక్షేమ శాఖ మంత్రి శ్రీ మహమ్మద్ అజహరుద్దీన్



ఆధ్వర్యంలో తెలంగాణ ప్రభుత్వం మైనారిటీ యువతకు నాణ్యమైన విద్య, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలు కల్పిస్తూ వారిని ఆత్మవిశ్వాసంతో కూడిన, స్వయం సమృద్ధి సాధించే పౌరులుగా తీర్చిదిద్దేందుకు కట్టుబడి ఉంది.

విడుదల చేసిన వారు:
సయ్యద్ మిన్హాజ్ హుస్సేన్
అసిస్టెంట్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్
గౌరవ మైనారిటీల సంక్షేమ శాఖ మంత్రి కార్యాలయం
తెలంగాణ ప్రభుత్వం
మొబైల్: ం91 70935 03974

# సూర్యాపేటకు రైల్వేను సాధించే వరకు పోరాటం కొనసాగాలి ... డాక్టర్ రామ్మూర్తి యాదవ్

**సూర్యాపేట జిల్లా ప్రతినిధి జులై :15 ( అన్వేషనేత్రం ):**





సూర్యాపేట ఎంతో కీలకమైన నగరం అయినప్పటికిని రైల్వే లైన్ లేకపోవడం ఎంతో విచారకరమని రైల్వే సాధించేందుకు తప్పనిసరిగా నిరంతర పోరాటం అవసరమని ప్రముఖ వైద్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మున్సిపాలిటీ కౌన్సిలర్,,డాక్టర్ రామ్మూర్తి యాదవ్ అన్నారు. సూర్యాపేటలో రైల్వే సాధన సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు అయిన కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూర్యాపేట చుట్టూ అనేక రైల్వే లైన్ ఉన్నాయని అటు ఖమ్మం నుండి కానీ నల్లగొండ నుండి గాని మిర్యాలగూడ నుండి గాని చిట్యాల నుండి గాని లేదా జనగామ నుండి గాని రైల్వే లైన్ తీయాలని ఎంతో కాలంగా సూర్యాపేట ప్రజలు అడుగుతూ వచ్చారని కానీ ఎవరూ పట్టించుకోలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి నేపథ్యంలోనే ఉద్యమాల అవసరాలు ఏర్పడతాయని ఈ ఉద్యమం ఎప్పటికప్పుడు అనేక కార్యక్రమాలు తీసుకొని ఈ కార్యాలయం ద్వారా ప్రజలను చైతన్యపరిచి బలమైన ఉద్యమాలు నిర్మించి సూర్యాపేట రైల్వే సాధించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రజా ప్రతినిధులు వివిధ రాజకీయ పక్షాల నాయకులు రాజకీయాలకు అతీతంగా సూర్యాపేటకు రైలు సాధించేందుకు సహకరించాలని కోరారు. సూర్యాపేట రైలు సాధన కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి సూర్యాపేట ప్రాధాన్యతను వివరించి రైల్వే లైన్ కోసం అడగాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ప్రముఖ ప్రజా వైద్యులు రైల్వే సాధన సమితి గౌరవాధ్యక్షులు డాక్టర్ కే రంగారెడ్డి, రైల్వే సాధన సమితి సలహాదారులు లింగంపల్లి భద్రయ్య, రైల్వే సాధన సమితి కో కన్వీనర్ రాచూరి ప్రతాప్ ప్రముఖ సామాజిక ఉద్యమకారులు చింతలపాటి చిన్న శ్రీరాములు, నీలా శ్రీనివాస్, ఎల్ఐసి జిల్లా నాయకులు గడ్డం వెంకన్న, సిపిఐ ఎంఎల్ నాయకులు కారింగుల వెంకన్న, వెంకట్ యాదవ్, టిఆర్పి జిల్లా అధ్యక్షులు మామిడి అంజయ్య, రైల్వే సాధన కోసం కృషి చేసిన ఆమనగంటి సైదులు మాట్లాడారు. బుద్ధ సత్యనారాయణ, ఎర్ర అఖిల్, మన్నెం యాదగిరి, నల్లపాటి అప్పారావు బయ్యా మల్లికార్జున్, కోడి వెంకటయ్య, పోతురాజు నరసయ్య మధుసూదన్ రెడ్డి తది తరులు పాల్గొన్నారు.

## బోరు అనుమతి కోసం రూ 20 వేల లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన భూగర్భ జలశాఖ అధికారులు

**సూర్యాపేట జిల్లా భూగర్భ జలశాఖ కార్యాలయంలో ఏసీబీ మెరుపు దాడి**

**సూర్యాపేట జిల్లా ప్రతినిధి జులై :15 ( అన్వేషనేత్రం):**

సూర్యాపేట జిల్లా భూగర్భ జలశాఖ కార్యాలయంలో అవినీతిపై అవినీతి నిరోధక శాఖ అధికారులు మెరుపు దాడి నిర్వహించి ఇద్దరు అధికారులను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు బోరు రిగ్గింగ్ అనుమతి మంజూరు చేసేందుకు దరఖాస్తుదారుడి నుంచి రూ 20 వేల లంచం డిమాండ్ చేసి స్వీకరిస్తున్న సమయంలో జిల్లా భూగర్భ జల అధికారి మెగావత్ బాలు డేటా ఎంట్రీ ఆపరేటర్ కొసరాజు వెంకటేశ్వర్లును ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు సమాచారం మేరకు ముందుగా అందిన ఫిర్యాదును పరిశీలించిన ఏసీబీ అధికారులు పక్కా ప్రణాళికతో ఉచ్చుపన్ని లంచం స్వీకరిస్తున్న సమయంలో దాడి నిర్వహించి నిందితులను పట్టుకున్నారు అనంతరం లంచం నగదును స్వాధీనం చేసుకుని అవసరమైన ఆధారాలను సేకరించారు అధికారులు నిందితులను



ప్రశ్నిస్తూ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను నమోదు చేస్తున్నారు నిందితులను వైద్య పరీక్షల అనంతరం నాంపల్లి ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరుపరచనున్నట్లు అధికారులు వెల్లడించారు ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతికి తావు లేకుండా కఠిన చర్యలు కొనసాగుతాయని ఏసీబీ అధికారులు స్పష్టం చేశారు ఈ ఘటన సూర్యాపేట జిల్లాలో చర్చనీయాంశంగా మారగా ప్రభుత్వ సేవల్లో పారదర్శకత కోసం ప్రజలు లంచాలు డిమాండ్ చేసిన అధికారులపై వెంటనే ఏసీబీకి ఫిర్యాదు చేయాలని అధికారులు సూచించారు కేసు దర్యాప్తు కొనసాగుతోంది.

# గ్రామాల్లో సామరస్యం, ధర్మ పరిరక్షణే లక్ష్యం

**త్రిదండి అహోబిల రామానుజ జీయర్ స్వామి**



**సూర్యాపేట జిల్లా ప్రతినిధి జులై :15 ( అన్వేషనేత్రం):**



గ్రామాల్లో ధర్మ పరిరక్షణ, ప్రజల్లో భక్తి భావం, సామరస్య వాతావరణం పెంపొందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని శ్రీ శ్రీ శ్రీ త్రిదండి అహోబిల రామానుజ జీయర్ స్వామి అన్నారు. బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో బాలాజీ బ్లాంకెట్ హాల్లో శ్రీరామ హృదయం సమీక్ష సమావేశానికి వారు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీరాముని కరుణ, ఆశీర్వాదాలు ప్రతి గ్రామానికి చేరేలా "శ్రీరామ హృదయం" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామాల్లో భక్తి, ఐక్యత, ఆధ్యాత్మిక చైతన్యం పెంపొందుతాయని చెప్పారు. వికాస తరంగిణి సేవకులు ఈ కార్యక్రమాన్ని ప్రతి గ్రామానికి తీసుకెళ్లి ప్రజలను భాగస్వాములను చేయాలని సూచించారు. ప్రతి సంవత్సరం అత్యంత వైభవంగా నిర్వహించే ఏకోత్తర సహస్ర కలశాభిషేకం (1001 కలశాలతో అభిషేకం) విశిష్టమైన ఆధ్యాత్మిక మహోత్సవమని పేర్కొన్నారు. శాస్త్రోక్తంగా సిద్ధం చేసిన పవిత్ర ద్రవ్యాలతో కలశాభిషేకం నిర్వహించడం ద్వారా దైవానుగ్రహం లభిస్తుందని తెలిపారు. ఈ పవిత్ర కలశాలు గ్రామాలకు చేరుకోవడంతో సమృద్ధిగా వర్షాలు కురవాలని, ప్రజలు సుఖశాంతులతో జీవించాలని, గ్రామాల్లో ఎలాంటి ఉపద్రవాలు లేకుండా అన్ని వర్గాల ప్రజల మధ్య సామరస్యం నెలకొనాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు మురళీధరచార్యులు, రామానుజచార్యులు, అశోక్ రావు, శ్రీనివాస్ రెడ్డి, భాస్కరరావు, చకీలం వేణుగోపాల్, ఈశ్వర్ రెడ్డి, నిర్మల, విజయకుమార్ గురవయ్య, మల్లికార్జున్, శ్రీధర్, రవీందర్ భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ ఇసుక రవాణాపై ఉక్కుపాదం..

**– అశ్వారావుపేట పోలీసుల ప్రత్యేక నిఘా ...**



అశ్వారావుపేట,జులై 15(అన్వేష నేత్రం ): ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణలోని అశ్వారావుపేట ప్రాంతానికి అక్రమంగా ఇసుక రవాణా జరగకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు అశ్వారావుపేట పోలీసులు తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసు శాఖ ఆదేశాల మేరకు సరిహద్దు ప్రాంతాల్లో వాహన తనిఖీలు, ఆకస్మిక తనిఖీలను ముమ్మరం చేసినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ అనుమతులు, చెల్లుబాటు అయ్యే రవాణా పత్రాలు లేకుండా లారీలు, ట్రాక్టర్లు, ఇతర వాహనాల్లో ఇసుకను తరలించడం చట్టవిరుద్ధమని పోలీసులు స్పష్టం చేశారు. అక్రమ ఇసుక రవాణాకు పాల్పడే వాహనాలను స్వాధీనం చేసుకోవడంతో పాటు సంబంధిత వ్యక్తులపై భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), గనులు, ఖనిజాల అభివృద్ధి నియంత్రణ చట్టం (ఎంఎండీఆర్ యాక్ట్), ఇతర వర్తించే చట్టాల ప్రకారం కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అక్రమ రవాణాకు పాల్పడే వ్యక్తులతో పాటు వాహన యజమానులు, డ్రైవర్లు, నిర్వాహకులు, వారికి సహకరించే వారిపైనా చట్టపరమైన చర్యలు తప్పవని అశ్వారావుపేట స్టేషన్ హౌస్ ఆఫీసర్ స్పష్టం చేశారు. అశ్వారావుపేట ప్రాంతంలో అక్రమ ఇసుక రవాణాను పూర్తిగా అరికట్టేందుకు నిరంతర వాహన తనిఖీలు, ప్రత్యేక నిఘా, ఆకస్మిక తనిఖీలు కొనసాగుతాయని తెలిపారు. చట్టాన్ని ఉల్లంఘించే వారిపై ఎలాంటి ఉపేక్ష ఉండదని హెచ్చరించారు. అక్రమ ఇసుక రవాణాకు సంబంధించిన సమాచారం తెలిసిన ప్రజలు వెంటనే సమీప పోలీస్ స్టేషన్ లేదా డయల్-100/112కు సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని పోలీసులు తెలిపారు.

# అద్దె వాహనాల బకాయిలు చెల్లించాలి

**పెరిగిన పెట్రోలు, డిజిటల్ ధరల ప్రకారం వాహనాల అద్దెలు పెంచాలి**

**సూర్యాపేట జిల్లా ప్రతినిధి జులై :15 ( అన్వేషనేత్రం):**

పెట్రోలు, డిజిటల్ ధరలు పెరిగినందున జిల్లా కలెక్టర్ కార్యాలయం లో వివిధ శాఖలకు వినియోగించే అద్దె వాహనాలకు చెల్లించే అద్దెలను పెంచాలని అద్దె వాహన యజమానుల అసోసియేషన్ అధ్యక్షులు చింతలచెరువు పవన్ అన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద అద్దె కారులతో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ గతంలో పెట్రోలు ధర లీటరు 54/- వున్నప్పుడు అద్దె వాహనాలకు నెలకు 33000/- చెల్లించే వారని, ప్రస్తుతం పెట్రోల్ ధర లీటరు 106/- వున్నందున అద్దె వాహనాలకు నెలకు 55000/- చెలించాలని వారు తెలిపారు. కలెక్టర్ కార్యాలయం లో అద్దె వాహనాల డ్రైవర్ లకు రెస్ట్ రూం సౌకర్యం కల్పించాలని, కార్లకు పార్కింగ్ సౌకర్యం కల్పించాలని అన్నారు. వివిధ విభాగాల నుండి అద్దె వాహనాలకు గత పది నెలల నుండి కిరాయిలు చెల్లించడం లేదని, అద్దె వాహనాలకు బకాయిలు వెంటనే చెల్లించాలని అన్నారు. జిల్లా కలెక్టర్ తేజస్ నంద లాల్ పవార్ కు ప్రజావాణి లో తమ సమస్యల పరిష్కారానికి వినతిపత్రం ఇచ్చామని తెలిపారు. కాబట్టి తమకు చెల్లించవలసిన బకాయిలను వెంటనే చెల్లించాలని, తాము డ్రైవర్ లకు వేతనాలు, పెట్రోల్ ఖర్చులు స్వంతంగా చెల్లించవలసి వస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సెక్రటరీ వెంకన్న, కోశాధికారి తన్నీరు మహేష్, సభ్యులు రహీం, సాయికుమార్, హరీష్, సందీప్, ప్రదీప్, జీవన్, కృష్ణ, గోవర్ధన్, శ్రీకాంత్, సిద్దార్ధ, మధు, షరీఫ్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.





RNI.No. TELTEL/2010/32434
అన్వేషనేత్రం
ఎడిటర్ : గోళ్ల రమేష్ తెలుగు దినపత్రిక

## సంపాదకీయం...

# మళ్లీ హర్మూజ్‌పైనే దేశాల దృష్టి

అమెరికా ఇరాన్ మధ్య మళ్లీ ప్రతీకార దాడులు చెలరేగుతుండడంతో పశ్చిమాసియా పరిస్థితి క్రమేణా క్షీణిస్తోంది. హర్మూజ్ జలసంధిలోని ఓ వాణిజ్య నౌకపై ఇరాన్ దాడులు చేయడంతో ఇరాన్‌పై అమెరికా ప్రతీకార దాడులకు దిగింది. ఇరాన్ దేశం అంతటా మొత్తం 140 లక్షాలపై తాము దాడులు చేశామని అమెరికా ఫెడరల్ కమాండ్ ప్రకటించింది. దీంతో రెచ్చిపోయిన టెహ్రాన్ అనేక అరబ్ దేశాలపై ప్రతీకార దాడులకు పాల్పడింది. ఈ ఉద్రిక్తతలతో హర్మూజ్ జలసంధి మార్గం మళ్లీ మూతపడే ప్రమాదం ముంచుకొస్తోంది. అయితే కేంద్ర వాణిజ్య మంత్రిత్వశాఖ మే నెల డేటా ప్రకారం దిగుమతి



చేసుకున్న చమురులో రష్యా నుంచి వచ్చిన చమురు వాటా 40 శాతానికి పైగా దాటింది. రష్యా నుంచి దిగుమతి చేసుకునే చమురుకు టన్నుకు అదనంగా 46 డాలర్ల వంతున అదనపు ధర చెల్లించవలసి వచ్చింది. దీంతో దిగుమతి విలువ 83 శాతం వరకు పెరిగింది. పరిణామం మాత్రం 2 శాతం తగ్గింది.

రష్యా ఉక్రెయిన్ యుద్ధం కారణంగా పశ్చిమ దేశాలు రష్యాపై ఆంక్షలు విధించిన సంగతి తెలిసిందే. అయినప్పటికీ చౌకగా లభించడం వల్ల భారతదేశం రష్యానుంచి ముడిచమురు దిగుమతులను కొనసాగించింది. ఈ కారణంగా భారత్‌లో ఆంక్షలకు ముందున్న స్థాయికి ముడిచమురు నిల్వలు చేరుకున్నాయి. అంతేకాకుండా గత రెండేళ్లలో ఒక దేశంనుండి ఇంత పెద్ద మొత్తంలో చమురు దిగుమతి కావడం ఇది అత్యధికం. హర్మూజ్ జలసంధి ఇప్పుడు మూతపడితే మనదేశానికి తక్షణం ఎలాంటి నష్టం కలగకపోయినా, దిగ్బంధనం మళ్లీ కొన్ని నెలలపాటు కొనసాగితే తీవ్ర సమస్యలు ఎదురవుతాయి. భారత దేశానికి అవసరమైన హైడ్రోకార్బన్లు అంటే ముడిచమురు, సహజ వాయువుల్లో అత్యధిక శాతం హర్మూజ్ జలసంధి మీదుగానే రవాణా అవుతుంటాయి. ఇళ్లల్లో, పరిశ్రమల్లో వినియోగించే లిక్విఫైడ్ నేచురల్ గ్యాస్ (ఎల్ఎన్‌జి), లిక్విఫైడ్ పెట్రోలియం గ్యాస్ (వంటగ్యాస్)లో దాదాపు 90 శాతం ఈ మార్గం ద్వారానే రవాణా అవుతోంది. ఆంక్షల నుంచి తాత్కాలికంగా మినహాయింపు లభించిన సమయంలో చమురు శుద్ధి కర్మాగారాలు క్రూడ్ ఆయిల్, ఎల్‌పిజి, ఎల్ఎన్‌జిలను ముందుగానే నిల్వ చేసుకోవడంతో దేశానికి ఎటువంటి అత్యవసర సమస్యనైనా తట్టుకునేందుకు తక్షణ వెసులుబాటు లభించింది. అయితే ఈ జలసంధి మార్గానికి ఎక్కువ కాలం ఆటంకం కలిగితే ఈ ఏడాది మార్చి ఏప్రిల్ నెలల్లో ఎదురైన సంక్షోభం మళ్లీ ఏర్పడే ప్రమాదం ఉంది. అంతర్జాతీయ సమస్యల వల్ల లేదా రవాణాలో ఆలస్యం వల్ల భారత్‌కు రావలసిన కొన్ని గ్యాస్ ఉత్పత్తులు నిలిచిపోయాయి. కానీ భారతదేశం వేరే మార్గాల ద్వారా ఆ లోటును భర్తీ చేసుకుంది. గత మార్చి నాటి సంక్షోభం ఏర్పడకుండా భారతదేశం ఎప్పటికప్పుడు పరిణామాలను గమనిస్తోంది. ముడిచమురు, ఎల్‌పిజి, ఎల్ఎన్‌జి, రసాయనాల నౌకల రవాణాకు ఆటంకం కలగనీయకుండా భాగస్వామ్య దేశాలతో సంప్రదింపులు జరుపుతోంది. ప్రపంచ ముడి చమురు వాణిజ్యంలో దాదాపు 20 శాతం (ఐదో వంతు) భారీ మొత్తంలో ద్రవీకృత సహజ వాయులు (ఎల్ఎన్‌జి) హర్మూజ్ జలసంధి మీదుగానే జరుగుతోంది. సౌదీఅరేబియా, ఇరాక్, ఖతార్, యుఎఇ, తదితర దేశాలు ఈ జలసంధి మీదుగానే నౌకలద్వారా ముడిచమురును పంపుతుంటాయి. ఇలాంటి పరిస్థితుల్లో హర్మూజ్ మూతపడితే సురక్షితమైన ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా నౌకలు ప్రయాణించవలసి వస్తుంది. దీనివల్ల నౌకల రవాణా సమయం, రవాణా ఛార్జీలు పెరిగి ప్రపంచవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ సరఫరా కరువై ధరలు అమాంతంగా పెరుగుతాయి. పైగా భారత్ తన అవసరాల కోసం దాదాపు 89 శాతం ముడి చమురును ఇతర దేశాల నుంచి కొనుగోలు చేస్తోంది. సరకు రవాణా ఖర్చులు కూడా విపరీతంగా పెరిగిపోతాయి. ప్రస్తుతం హర్మూజ్ జలసంధి మీదుగా నౌకలు సాగుతున్నాయని అమెరికా దబాయిస్తున్నప్పటికీ వాస్తవానికి ఏ నౌకలు సాగడం లేదు. అంతర్జాతీయ ఆంక్షల నుంచి తప్పించుకోవడానికి బ్లాక్ మార్కెట్ నౌకలు రవాణా కావచ్చు. వీటినే షాడో టాంకర్ కార్యకలాపాలుగా వ్యవహరిస్తున్నారు. ఇది చట్టవిరుద్ధంగా సాగే చమురు అక్రమ రవాణా. ఇప్పటికిప్పుడే ఎలాంటి సమస్యలు ఉండవని ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఎక్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్ డైరెక్టర్ జనరల్ అజయ్ సహాయ్ అభిప్రాయపడుతున్నారు. ఎందుకంటే వాణిజ్య నౌకలు ఇప్పటికే హర్మూజ్ జలసంధి మీదుగా రాకపోకలు సాగించడం మానేశాయని చెప్పారు. ఇంజినీరింగ్ వస్తువుల ఉత్పత్తులు, ఎగుమతులకు సంబంధించిన ఇంజినీరింగ్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ (ఇఇపిసి) ప్రస్తుత ఛైర్మన్ పంకజ్ చద్దా నౌకల రవాణా కన్నా గ్యాస్ లభ్యతపై ఇంజినీరింగ్ వస్తువుల ఎగుమతిదారులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని పేర్కొనడం గమనార్హం. అలాగే జులై 1 నుంచి గ్యాస్ ధరలు కూడా అందుబాటు లోకి వచ్చాయన్నారు. కానీ ఇప్పుడు పరిస్థితి తారుమారయ్యేలా కనిపిస్తోందన్నారు.

## ఎగుమతిదారులకు ప్రోత్సాహకాలు..!

### యుఎస్ టారిఫ్‌ల వేళ కేంద్రం కసరత్తు

**న్యూఢిల్లీ :**

భారత్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారీగా విధించిన టారిఫ్‌ల నేపథ్యంలో ఎగుమతులకు ప్రత్యేక ప్రోత్సాహకాలు ఇవ్వడానికి కేంద్రం కసరత్తు చేస్తోంది. ట్రంప్ టారిఫ్‌లతో ఎగుమతిదారుల్లో తీవ్ర ఆందోళనలు నెలకొన్న విషయం తెలిసిందే.



ఈ నేపథ్యంలోనే భారత ఎగుమతిదారులకు మద్దతునిచ్చేలా ప్రత్యేక పథకాలను ప్రవేశపెట్టనుందని రిపోర్టులు వస్తోన్నాయి. రష్యా చమురును కొనుగోలు చేస్తోందనే అక్కసుతో భారత్‌పై ట్రంప్ 50 శాతం టారిఫ్‌లను విధించిన విషయం తెలిసిందే. ఈ అధిక టారిఫ్‌ల వల్ల వస్త్రాలు, జౌళి ఉత్పత్తులు, ఆభరణాలు, రత్నాలు, వ్యవసాయ, మత్స్య సంబంధిత ఉత్పత్తుల ఎగుమతులపై తీవ్ర ప్రభావం పడుతోన్న నేపథ్యంలో కేంద్రం ప్రోత్సాహక చర్యలకు సిద్ధమైనట్లు సమాచారం. ఇందులో భాగంగా చిన్న ఎగుమతిదారులు ఎదు ర్కొంటున్న ద్రవ్య పరిమితులను పరిష్కరించాలని కేంద్రం యోచన. అదే విధంగా కంపెనీలపై నిర్వహణ భారం తగ్గించేలా చర్యలు తీసుకోవడంతో పాటుగా ఎగుమతులకు సంబంధించిన రంగాల్లో ఉద్యోగ భద్రతను కల్పించడం, ఎగుమతుల కోసం కొత్త మార్కెట్లను అన్వేషణకు మద్దతునిచ్చేలా కేంద్రం ప్రణాళికలు రూపొందిస్తోందని సమాచారం. గడిచిన ఆర్థిక సంవత్సరం 2024–25 మొత్తం ఎగుమతుల్లో అమెరికా వాటా దాదాపు 20 శాతంగా ఉంది.

## ఓలా ఎలక్ట్రిక్‌లో సాఫ్ట్‌బ్యాంక్ వాటా తగ్గింపు

2.15 శాతం వాటా విక్రయం

బెంగళూరు : ద్విచక్ర విద్యుత్ వాహనాల కంపెనీ ఓలా ఎలక్ట్రిక్‌లో జపాన్‌కు చెందిన సాఫ్ట్‌బ్యాంక్ 2.15 శాతం వాటాలను విక్రయించింది. దీంతో సాఫ్ట్‌బ్యాంక్ తన హోల్డింగ్ వాటాను 17.83 శాతం నుంచి 15.68 శాతానికి కుదించుకుందని ఓలా ఎలక్ట్రిక్ గురువారం రెగ్యులేటరీ సంస్థలకు సమాచారం ఇచ్చింది. జూలై 15 నుండి సెప్టెంబర్ 2 మధ్య జరిగిన వరుస విక్రయాల్లో ఓలా ఎలక్ట్రిక్ మొబిలిటీ లిమిటెడ్‌లోని కొన్ని ఈక్విటీ షేర్లను విక్రయించిందని పేర్కొంది. 2025 జూన్ 30 నాటికి ఓలా ఎలక్ట్రిక్‌లో సాఫ్ట్ బ్యాంక్ 17.83 కోట్ల షేర్లను కలిగి ఉంది. ఇది 78.65 కోట్ల ఈక్విటీ షేర్లలో 17.83 శాతం వాటాకు సమానం. మార్కెట్ల ముగింపునకు కొద్ది సేపు ముందు ఓలా ఈ విషయాన్ని వెల్లడించింది. మరోవైపు ఓలా ఎలక్ట్రిక్ షేర్లు 7 శాతం పతనమై రూ.64.49 వద్ద ముగిశాయి. 350సిసి లోపు ఇంజన్ సామర్థ్యం కలిగిన ద్విచక్ర వాహనాలపై జిఎస్‌టిని 28 శాతం నుంచి 18 శాతానికి తగ్గించడం ఓలా ఎలక్ట్రిక్ షేర్లపై ఒత్తిడిని పెంచింది.

# కంపెనీలు జిఎస్‌టి ఫలాలను బదిలీ చేయాలి

### ప్రతీ రూపాయి వినియోగదారుడికి చేరాలి

### వాణిజ్య శాఖ మంత్రి పియూష్ గోయల్

**న్యూఢిల్లీ :**

జిఎస్‌టి కౌన్సిల్ తగ్గించిన పన్ను రేట్లను కంపెనీలు వినియోగదారులకు బదిలీ చేయాలని కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పియూష్ గోయల్ అన్నారు. జిఎస్‌టి తగ్గింపు ద్వారా ఆదా అయిన ప్రతీ రూపాయిని వినియోగదారులకు అందించాలన్నారు. అదే విధంగా దేశీయ ఉత్పత్తులకు ఎక్కువ ప్రచారం కల్పించాలని సూచించారు. భారతీయుల కష్టార్జితంతో ఇక్కడి భూమిలో పండిన ఉత్పత్తులకు మద్దతును అందించాలన్నారు. స్వదేశీ ఉత్పత్తులు దేశంలోని ప్రతీ మూలకు చేరినప్పుడు అవి ఆర్థిక విలువతో పాటు దేశ స్వావలంబనను సూచిస్తాయన్నారు. జిఎస్‌టి శ్లాబులను 5, 18 శ్లాబులకు పరిమితం చేస్తూ బుధవారం జిఎస్‌టి కౌన్సిల్ తీర్మాణం చేసిన విషయం తెలిసిందే. కొత్త పన్ను రేట్లు సెప్టెంబర్ 22 నుంచి అమల్లోకి రానున్నాయి. ఈ నేపథ్యంలోనే మంత్రి పియూష్ గోయల్ తగ్గిన రేట్లను వినియోగదారులకు బదిలీ చేయాలని కంపెనీలకు, విక్రేతలకు సూచించారు.

### రుణాల విస్తరణకు డిమాండ్ : ఎస్‌బిఐ ఛైర్మన్

జిఎస్‌టి కౌన్సిల్ పన్ను రేట్లను 5 శాతం, 12 శాతానికి పరిమితం చేయడం పరోక్ష పన్ను సంస్కరణల్లో ఒక మైలురాయి అని ఎస్‌బిఐ ఛైర్మన్ సిఎస్ శెట్టి అన్నారు. గతంలో 12 శాతం, 18 శాతం పన్ను విధించబడిన గృహోపకరణాలు ఇప్పుడు 5 శాతంలోకి వచ్చాయన్నారు. ఇది తక్కువ ఆదాయం కలిగిన వారికి ఉపశమనం అందిస్తుందన్నారు.. ఎక్కువ వినియోగ శక్తితో, డిమాండ్, రుణ విస్తరణ పెరిగి ఆర్థిక వృద్ధికి దోహదం చేయనుందని సిఎస్ శెట్టి అన్నారు. బీమా రంగం తక్కువ ప్రీమియంతో మెరుగైన రక్షణ కవరేజీ సహా బీమా వినిమయం విస్తరణకు దోహదం చేయనుందన్నారు. రాబోయే త్రైమాసికాల్లో జిడిపి వృద్ధికి సానుకూల ప్రభావం చూపుతుందన్నారు.

### నిర్మాణ వ్యయం తగ్గనుంది : అన్‌రాక్

కేంద్ర ప్రభుత్వం జిఎస్‌టిలో మార్పులు చేస్తూ తీసుకున్న నిర్ణయం ద్వారా రియల్ ఎస్టేట్‌కు ఊతం లభించనుందని ఆ వర్గాలు పేర్కొన్నాయి. నిర్మాణ రంగంలోని పలు వస్తువుల ధరలకు సంబంధించిన శ్లాబులను మార్చడం ద్వారా ముడి సరుకుల వ్యయం తగ్గనుందని ఆన్‌రాక్ గ్రూప్ ఛైర్మన్ అనుజ్ పూరి పేర్కొన్నారు. సిమెంట్‌పై పన్నులు తగ్గడం ద్వారా నిర్మాణ వ్యయం 3–5 శాతం వరకు తగ్గనుందన్నారు.




RNI.No. TELTEL/2010/32434
అన్వేషనేత్రం
ఎడిటర్ : గోళ్ల రమేష్ తెలుగు దినపత్రిక

## బిజినెస్..

# ప్రభావం చూపని జిఎస్‌టి శ్లాబుల తగ్గింపు

**ముంబయి :**

వస్తు సేవల పన్ను (జిఎస్‌టి) శ్లాబుల తగ్గింపు మార్కెట్లలో ఉత్సాహాన్ని నింపలేకపోతోంది. ఆర్థిక వ్యవస్థలో ఉన్న బలహీనతలు, అమెరికా టారిఫ్‌ల భయాలు ఇప్పటికీ ఇన్వెస్టర్లను వెంటాడుతున్నాయి. జిఎస్‌టి శ్లాబులను 5, 12 శాతాలకు తగ్గించడం ద్వారా మార్కెట్లు పరుగులు పెడతాయని ప్రభుత్వ వర్గాలు ఊహించినప్పటికీ.. ఆచరణలో భిన్నంగా ట్రేడింగ్ అవుతోన్నాయి. గురువారం, శుక్రవారం సెషన్‌లు ఆశించిన స్థాయిలో రాణించలేకపోయాయి. మరోవైపు డాలర్‌తో రూపాయి మారకం విలువ రోజు రోజుకు పడిపోతూ చరిత్రలోనే ఎప్పుడూ లేని కనిష్ట స్థాయి 88.27కు దిగజారింది. విదేశీ సంస్థాగత పెట్టుబడులు తరలిపోవడంతో వారాంతం సెషన్‌లో సెన్సెక్స్, నిఫ్టీలు మిశ్రమంగా నమోదయ్యాయి. బిఎస్ఇ సెన్సెక్స్ 7.25 శాతం తగ్గి 80,710.76 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 7 పాయింట్లు పెరిగి 24,641 వద్ద నమోదయ్యింది. ఇంతక్రితం సెషన్‌లోనూ సెన్సెక్స్ 150 పాయింట్ల ర్యాలీతో సరిపెట్టుకుంది. వారాంతం సెషన్‌లో బిఎస్ఇలో మహీంద్రా అండ్ మహీంద్రా, మారుతి సుజుకి, రిలయన్స్ ఇండిస్టీస్ షేర్లు అధికంగా లాభపడిన వాటిలో ఉండగా.. ఐటిసి, హెచ్‌సిఎల్ టెక్నాలజీ, టిసిఎస్ షేర్లు అధికంగా నష్టపోయాయి. నిఫ్టీలో మిడ్ క్యాప్ 0.20 శాతం, స్మాల్ క్యాప్ 0.19 శాతం చొప్పున పెరిగాయి. ఆటో రంగం 1.125 శాతం, లోహ రంగం 0.68 శాతం, మీడియా 0.59 శాతం చొప్పున పెరగ్గా.. ఐటి రంగం ఏకంగా 1.44 శాతం నష్టపోయింది. ఇదే బాటలో ఎఫ్ఎంసిజి 1.42 శాతం, రియాల్టీ 1.16 శాతం చొప్పున ప్రతికూలతను ఎదుర్కొన్నాయి.



# రోగులకు ఆప్యాయతతో సేవలందించండి

## నిర్లక్ష్యంపై కఠిన చర్యలు తప్పవు: జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్

**నల్గొండ, జూలై 15 (అన్వేషనేత్రం ప్రతినిధి ) :**

ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులతో మర్యాదగా, గౌరవంగా వ్యవహరిస్తూ నాణ్యమైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ వైద్య సిబ్బందిని ఆదేశించారు. బుధవారం నాగార్జునసాగర్‌లోని కమలా నెహ్రూ ప్రభుత్వ ఆసుపత్రిని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ఆరోగ్య మిత్ర కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్, అక్కడ సిబ్బంది లేకపోవడంపై ఆసుపత్రి ప్రధాన వైద్యాధికారిని వివరణ కోరారు. అనంతరం చికిత్స కోసం వచ్చిన రోగులతో స్వయంగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. గురుకుల పాఠశాలలో సీటు పొందిన తమ కుమార్తెకు ఆరోగ్య ధ్రువీకరణ పత్రం కోసం వచ్చామని ఓ కుటుంబం తెలిపింది.





మరో మహిళ రక్తంలో చక్కెర స్థాయి 350 ఉండటంతో చికిత్స కోసం వచ్చినట్లు చెప్పగా, ఆమెకు ధైర్యం చెప్పిన కలెక్టర్, విధి నిర్వహణలో ఉన్న వైద్యుడిని పిలిపించి తగిన ఆహార నియమాలు వివరించి మెరుగైన చికిత్స అందించాలని సూచించారు. ఔషధ పంపిణీ కేంద్రాన్ని పరిశీలించిన ఆయన, మందుల నిల్వలు, పంపిణీ వివరాలను నమోదుపుస్తకంలో కచ్చితంగా నమోదు చేయాలని ఆదేశించారు. బాహ్య రోగుల విభాగాన్ని తనిఖీ చేసి, రోజూ సుమారు 200 మంది చికిత్స పొందుతున్నట్లు తెలుసుకున్నారు. నర్సింగ్ సిబ్బందితో మాట్లాడిన కలెక్టర్, ముఖ్యంగా ప్రసవాల కోసం వచ్చే గర్భిణులతో గౌరవంగా, ఆప్యాయంగా మాట్లాడాలని, వారికి సకాలంలో మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. రోగుల పట్ల నిర్లక్ష్యం లేదా అమర్యాద ప్రదర్శిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కుక్కలు, కోతులు కరిచిన బాధితులకు అవసరమైన టీకాలు, మందుల నిల్వలపై ఆరా తీశారు. ప్రతిరోజూ అందిస్తున్న వైద్య సేవలకు సంబంధించిన వివరాలను నమోదుపుస్తకంలో తప్పనిసరిగా నమోదు చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలకు చెందిన ఓ ఉపాధ్యాయుడు కోతి దాడికి గురైన బాలికను ఆసుపత్రికి తీసుకురాగా, ఘటన వివరాలు తెలుసుకున్న కలెక్టర్‌కు అవసరమైన మందులు అందుబాటులో ఉన్నాయని ఆసుపత్రి ప్రధాన వైద్యాధికారి తెలిపారు. కోతుల సమస్యకు శాశ్వత పరిష్కారంగా త్వరలోనే జంతు జనన నియంత్రణ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. మూత్రపిండ శుద్ధి కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్, అక్కడ చికిత్స పొందుతున్న కొల్లి రామలింగంను పలకరించి అందుతున్న వైద్య సేవలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. సేవలు సంతృప్తికరంగా ఉన్నాయని రోగి తెలిపారు. ఆసుపత్రిలోని వివిధ విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించిన కలెక్టర్, రోగులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు, వైద్య సిబ్బంది నిరంతరం పర్యవేక్షిస్తూ నాణ్యమైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. ఈ తనిఖీలో ఆసుపత్రి ప్రధాన వైద్యాధికారి హరికృష్ణ, మున్సిపల్ చైర్మన్ మానస స్వర్ణ సుమన్, తహసీల్దార్ ఖాసీం, మున్సిపల్ కమిషనర్ సీహెచ్ సైదులు, డాక్టర్ అనితారాణి, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఓటరు జాబితా సవరణ వేగవంతం చేయండి..

## పెండింగ్ నమోదు వెంటనే పూర్తి చేయాలి

**నల్గొండ, జూలై 15 (అన్వేషనేత్రం ప్రతినిధి):**

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసి, పెండింగ్‌లో ఉన్న ఓటర్ల నమోదును తక్షణమే పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ బూత్ స్థాయి అధికారులను ఆదేశించారు. బుధవారం నాగార్జునసాగర్‌లోని 7, 10, 12 వార్డుల్లో జరుగుతున్న ఓటరు జాబితా సవరణ, ఓటర్ల నమోదు ప్రక్రియను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇంటింటికీ వెళ్లి బూత్ స్థాయి అధికారులు చేపడుతున్న నమోదును పరిశీలించిన కలెక్టర్, ఓ వార్డులో మొత్తం ఓటర్ల సంఖ్య, రూపొందించిన దరఖాస్తుల వివరాలు, పూర్తయిన నమోదు, పెండింగ్‌లో ఉన్న వివరాలను అడిగి తెలుసుకున్నారు. మొత్తం 961 మంది ఓటర్లలో 593 మంది నమోదు పూర్తయిందని, మిగిలిన వారి ప్రక్రియ కొనసాగుతోందని సంబంధిత అధికారి వివరించారు. దీనిపై స్పందించిన కలెక్టర్, ఒక్క ఓటరు కూడా మిగలకుండా ప్రతి ఇంటిని సందర్శించి నమోదు పూర్తిచేయాలని ఆదేశించారు. ఇంటికి తాళం వేసి ఉండడం వల్ల అందుబాటులో లేని ఓటర్లను ఫోన్ ద్వారా సంప్రదించి నమోదు పూర్తిచేయాలని సూచించారు.





ప్రతి ఇంటి నంబరును నమోదు చేస్తూ ఓటర్ల వివరాలను ధ్రువీకరించాలని, ఇంకా నమోదు కాని వారి వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని చెప్పారు. ఓటరు గుర్తింపు కార్డు సంఖ్య అందుబాటులో ఉంటే దాని ఆధారంగా వివరాలను నమోదు చేసి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ఒక వ్యక్తికి ఒకే ఓటు ఉండేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, నమోదు పూర్తైన వెంటనే వివరాలను సక్రమంగా నమోదు చేయాలని ఆదేశించారు. ఓటరు తన గుర్తింపు కార్డు సంఖ్యను తెలియజేస్తే వెంటనే ఆన్‌లైన్‌లో పరిశీలించి వివరాలను నిర్ధారించవచ్చని కలెక్టర్ తెలిపారు. ఇదే సందర్భంగా 10వ వార్డులో ఓ ఓటరు తన గుర్తింపు కార్డును చూపించగా, కలెక్టర్ వెంటనే ఆన్‌లైన్‌లో పరిశీలించి ఓటు నమోదు ఉన్నట్లు నిర్ధారించారు. మరణించిన వారి పేర్లను ఓటరు జాబితా నుంచి తొలగించేందుకు మరణ ధ్రువీకరణ పత్రం ఆధారంగా ప్రక్రియ పూర్తిచేయాలని సూచించారు. అనంతరం 109వ పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి అక్కడి బూత్ స్థాయి అధికారిని వార్డులోని మొత్తం ఓటర్లు, పూర్తయిన నమోదు, పెండింగ్ వివరాలపై ఆరా తీశారు. వివాహానంతరం ఇతర ప్రాంతాల్లో స్థిరపడిన మహిళలు, వేరే ప్రాంతాలకు వెళ్లిన వారు, ఇంకా గుర్తించని ఓటర్ల వివరాలను ప్రత్యేకంగా సేకరించాలని ఆదేశించారు. ఇంకా నమోదు కాని ఓటర్ల కుటుంబ సభ్యులను కార్యాలయం నుంచి ఫోన్ ద్వారా సంప్రదించి అవసరమైన వివరాలు సేకరించి ప్రక్రియను పూర్తిచేయాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా, ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ప్రత్యేక సమగ్ర సవరణను త్వరితగతిన పూర్తిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. కలెక్టర్ వెంట మున్సిపల్ కమిషనర్ సీహెచ్ సైదులు, తహసీల్దార్ ఖాసీం, మున్సిపల్ చైర్‌పర్సన్ మానస స్వర్ణ సుమన్, కౌన్సిలర్ వినిష, డిప్యూటీ తహసీల్దార్ శ్రీదేవి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సందీప్, అధికారులు, బూత్ స్థాయి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మాదిగ వరంగల్ ఉమ్మడి జిల్లా ఉద్యోగుల విభాగం అధ్యక్షుడిగా నియమించిన సమ్మయ్య కు నియామక పత్రం అందజేసిన డాక్టర్ రామకృష్ణ పెరుమాండ్ల

**హనుమకొండ జిల్లా, కాకాజీ కాలనీ, జూలై 15:**

మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షులు రేగుంట సునీల్ మాదిగ గారి ఆదేశాల మేరకు, రాష్ట్ర గౌరవ అధ్యక్షులు డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ, రాష్ట్ర ముఖ్య సలహాదారు కొమ్ముల బాబు రిటైర్డ్ గెజిటెడ్ హెడ్‌మాస్టర్ సమక్షంలో, మాదిగ హక్కుల దండోరా వరంగల్ ఉమ్మడి జిల్లా ఉద్యోగుల విభాగం అధ్యక్షుడిగా సరికొమ్ముల సమ్మయ్య ను నియమిస్తూ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ మాట్లాడుతూ, మాదిగ ఉద్యోగులను సంఘటితం చేసి వారి సమస్యల పరిష్కారం కోసం ఉద్యోగుల విభాగం మరింత బలోపేతం కావాలని, సామాజిక న్యాయం సాధనలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ముఖ్య సలహాదారు కొమ్ముల బాబు మాట్లాడుతూ, ఉద్యోగుల ఐక్యతతోనే మాదిగ సమాజానికి న్యాయం సాధ్యమవుతుందని, నూతన అధ్యక్షుడు ఉప్యేక నాయకత్వంలో ఉద్యోగుల విభాగం మరింత చురుకుగా పనిచేసి సమాజానికి సేవ చేయాలని ఆకాంక్షించారు. నూతనంగా నియమితులైన సరికొమ్ముల సమ్మయ్య మాట్లాడుతూ, తనపై ఉంచిన నమ్మకానికి రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ, వరంగల్ ఉమ్మడి జిల్లాలోని మాదిగ ఉద్యోగులను ఏకం చేసి వారి హక్కులు, సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ జాన్సన్, మాదిగ హక్కుల దండోరా నాయకులు, ఉద్యోగులు, కార్యకర్తలు మరియు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.



# మన ఓటు -- మన బాధ్యత" సర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి: డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ





**హనుమకొండ జిల్లా, విజయపాల్ కాలనీ , జూలై 15:**

వరంగల్ వెస్ట్ ఏం ఎల్ ఏ నాయిని రాజేందర్ రెడ్డి గారు ఆదేశాల మేరకు సర్ కార్యక్రమంలో భాగంగా ఓటరు జాబితా సవరణ ప్రక్రియను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మన ఓటు మన బాధ్యత అని కాంగ్రెస్ పార్టీ 60వ డివిజన్ ఇన్‌చార్జ్ డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా 60వ డివిజన్ పరిధిలో బూత్‌లను సందర్శించి, ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పరిశీలించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ తమ పేరు ఓటరు జాబితాలో నమోదు చేసుకోవడం, అవసరమైన మార్పులు, చేర్పులు, తొలగింపులు సమయానికి పూర్తి చేసుకోవాలని ప్రజలకు సూచించారు. ఈ పర్యటనలో మాజీ కార్పొరేటర్ నగరాజు, డివిజన్ అధ్యక్షుడు పున్నం సీనియర్ కాంగ్రెస్ నాయకులు జనగామ శ్రీనివాస్ తదితరులు పాల్గొని డివిజన్‌లో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా డాక్టర్ రామకృష్ణ పెరుమాండ్ల మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత విలువైన హక్కు అని, ప్రతి పౌరుడు ఓటరు జాబితాలో తన వివరాలు సరిచూసుకొని, సవరణ ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఓటరు నమోదు మరియు సవరణ కార్యక్రమాలపై ప్రజల్లో అవగాహన కల్పించే కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు.





కొండ దంపతుల ఆదేశాల మేరకు రాష్ట్ర నాయకులు గోపాల నవీన్ రాజ్ గారి సూచనలతో, 10 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ఓటర్లు 12 వ డివిజన్ ఏరియాలో ంటితీ అప్లికేషన్ ఫారాలు నింపుతున్న 12 డివిజన్ కార్పొరేటర్ కావటి కవిత రాజు యాదవ్ నేత 12 డివిజన్ మాజీ ప్రెసిడెంట్ చిలుక శ్రీధర్ నేత బి ఎల్ ఓ , స్పందన గోవింద్ భాస్కర్ , మైనార్టీ కాలనీ వీవర్స్ కాలనీలో కిష్టోజ్ రాజు మార్చారి కృష్ణ వెంగళ కుమార్ మరియు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు ఎస్ ఐ ఆర్ అప్లికేషన్ ఫారాలు నింపడం ఓటర్ల సందేహాలకు పరిష్కారం చూపిస్తూ అవగాహన కల్పించడం జరిగింది

గత మూడు రోజులుగా సోషల్ మీడియా వేదికగా నా పేరుతో కొందరు అవాస్తవాలు, అసత్య ప్రచారాలు చేస్తున్నారు. వాటిని నేను పూర్తిగా ఖండిస్తున్నాను. నేను వ్యక్తిగతంగా ఎక్కడ ఏ వ్యక్తిని కానీ ఏ కులాన్ని కానీ దూషించలేదు. ఈ ప్రచారంలో ఉన్న ఆడియోలు, వీడియోలు ూ× సాంకేతికతను ఉపయోగించి, సందర్భానికి విరుద్ధంగా చూపిస్తున్నట్లు స్పష్టంగా కనిపిస్తోంది. నా రాజకీయ ఎదుగుదలను ఓర్వలేక కొందరు నాయకులు పక్కా ప్రణాళికతో ఇలాంటి తప్పుడు ప్రచారాన్ని వెబ్ సిరీస్‌లా కొనసాగిస్తున్నారు. ఇంకా కూడా అనేకం ఉన్నాయని ప్రస్తావిస్తున్నారు. గతంలో మన్సురాబాద్ లో ఎప్పుడో జరిగిన ఫ్లెక్సీ వివాదాన్ని ప్రస్తుత పరిణామాలకు ముడిపెట్టి తప్పుడు ప్రచారం చేస్తున్నారు. యువజన కాంగ్రెస్‌లో మేము అన్ని కులాలు, మతాలు, వర్గాల వారితో కలిసి పనిచేస్తున్నాం. అలాంటి మాకు కుల ఫీలింగ్ అనే భావనే లేదు. మాకు ఉన్నది ఒక్కటే కులం అదే యువకులం. ఈ ప్రచారాన్ని ఉద్దేశపూర్వకంగా కులసంఘాలకు ముడిపెట్టి కొందరు రాజకీయ లబ్ధి పొందాలని ప్రయత్నిస్తున్నారు. అలాంటి ప్రయత్నాలను నేను పూర్తిగా ఖండిస్తున్నాను. అయినప్పటికీ ఈ విషయంలో ఏ కులసంఘం మనోభావాలైనా దెబ్బతిన్నట్లయితే, వారికి నేను భేషరతుగా క్షమాపణలు తెలుపుతున్నాను.

బి జక్కిడి శివచరణ్ రెడ్డి
రాష్ట్ర అధ్యక్షులు
తెలంగాణ యువజన కాంగ్రెస్







# ఫిఫా 2026 వరల్డ్ కప్: ఫుట్బాల్ జ్వాల ప్రపంచాన్ని వెలిగిస్తుంది

**ఉమ్మడి నల్గొండ జిల్లా ఫుట్బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బొమ్మపాల గిరిబాబు**

**ప్రపంచ దేశాలను ఒకే వేదికపై నిలబెట్టే గొప్ప క్రీడా మహోత్సవం ఫిఫా వరల్డ్ కప్ స్ఫూర్తితో నల్గొండ జిల్లాలో ఫుట్బాల్ క్రీడాభివృద్ధి జరుగుతుందని తెలిపిన బొమ్మపాల గిరిబాబు**



ఫుట్బాల్ కేవలం ఒక ఆట మాత్రమే కాదని అది అంకితభావాన్ని, క్రమశిక్షణను, ఐక్యతను, నాయకత్వ లక్షణాలను, దేశభక్తిని పెంపొందిస్తుందని బొమ్మపాల గిరిబాబు తెలిపారు. 48 దేశాలు పాల్గొంటున్న ఫిఫా 2026 వరల్డ్ కప్ పోటీలు ప్రస్తుతం సెమీఫైనల్స్ నిర్వహించుకుంటూ జూలై 19 జరిగే ఫైనల్ మ్యాచ్ కు ఎదురుచూస్తుందని తెలిపారు. ఈ మెగా టోర్నమెంట్ స్ఫూర్తితో, తెలంగాణ ఫుట్బాల్ అసోసియేషన్ అందిస్తున్న సంపూర్ణ సహకారంతో, ఉమ్మడి నల్గొండ జిల్లాలో ప్రతి గ్రామాన, ప్రతి పాఠశాలలో ఫుట్బాల్ క్రీడాభివృద్ధి కి










అసోసియేషన్ పక్షాన బృహత్తమైన ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామని తెలియజేస్తూ, క్షేత్రస్థాయిలో వ్యాయామ ఉపాధ్యాయులు, సీనియర్ ఫుట్బాల్ క్రీడాకారులు, కోచ్ ల సహకారంతో ఈ ఆశయం విజయవంతం కావడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని తెలిపారు.

# శ్రమ నీదైతే గుర్తింపు నీ వెంటే వస్తుంది

కష్టకాలంలో పార్టీ జెండా మోసి.. రేవంతన్న, అడుగుజాడల్లో నడుస్తూ, ప్రతిపక్షాల విమర్శలపై సింహస్వప్నాల్లా పోరాడిన మన యువ సింహాలు, ప్రభుత్వ విప్‌లు అద్దంకి దయాకర్ అన్నకి, బల్మూరి వెంకట్ అన్నకి "రాష్ట్ర మంత్రి హోదా కేబినెట్ ర్యాంక్ దక్కడం హర్షణీయంరేవంతన్న లీడర్‌షిప్‌లో కష్టపడే ప్రతి కార్యకర్తకీ, నాయకుడికీ తగిన గుర్తింపు లభిస్తుందని ఈ నిర్ణయం మరోసారి నిరూపించింది. నమ్మిన సిద్ధాంతం కోసం, పార్టీ బలోపేతం కోసం జైలుకెళ్లడానికైనా వెనుకాడని మన అన్నలకి దక్కిన సరైన గౌరవం ఇదిఅన్నలు అద్దంకి దయాకర్ గారికి, బల్మూరి వెంకట్ గారికి హృదయపూర్వక అభినందనలు! రేవంతన్న, కొండా సురేఖమ్మ ఆశీస్సులతో మీరిద్దరూ ప్రజాసేవలో మరింత ముందుకు సాగాలని కోరుకుంటున్నాను.



మీ... సిలివేరు అనిల్
యువజన కాంగ్రెస్ కొండా యువసేన రాష్ట్ర నాయకులు





ఈరోజు వెలిశాల గ్రామంలో గౌరవ గ్రామ సర్పంచ్ శ్రీమతి కుంభం మంజుల సతీష్ గౌడ్ గారి అధ్యక్షతన, తుంగతుర్తి అభివృద్ధి ప్రదాత గౌరవ శాసనసభ్యులు శ్రీ మందుల సామేల్ గారి సహకారంతో రూ.10 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన తిరుమలగిరి మండల కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షులు శ్రీ సుంకర జనార్ధన్ గారు సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. అలాగే తిరుమలగిరి మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీ ధరావత్ జిమ్మిలాల్ గారు, ఉపసర్పంచ్ శ్రీమతి చాలకండ్ల వెంకటమ్మ గారు, మహిళా సంఘం బంధం అధ్యక్షురాలు శ్రీమతి పులిమామిడి శోభ గారు, గ్రామ పెద్దలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వార్డు సభ్యులు, గ్రామ సిబ్బంది, ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.





బీసీల సంక్షేమం, విద్య, ఉపాధి, ఆర్థిక సాధికారతకు సంబంధించిన పెండింగ్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర నూతన ప్రధాన కార్యదర్శి శ్రీ సంజయ్ జాజు, ×ూూ గారిని మర్యాదపూర్వకంగా కలిసి సమగ్ర వినతిపత్రం సమర్పించాను. బీసీల హక్కులు, అవకాశాలు, సాధికారత కోసం మా పోరాటం నిరంతరం కొనసాగుతుంది. సమగ్ర తెలంగాణ నిర్మాణంలో బీసీల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇవ్వాలని విజ్ఞప్తి చేశాము.
"బీసీల అభివృద్ధే తెలంగాణ అభివృద్ధికి బలమైన పునాది."
గుజ్జ సత్యం
జాతీయ ఉపాధ్యక్షులు
జాతీయ బీసీ సంక్షేమ సంఘం
స్టేట్ కోఆర్డినేటర్
బిసి జాయింట్ యాక్షన్ కమిటీ బీసీ జేఏసీ

# మిర్యాలగూడలో పోలీసుల ఆకస్మిక తనిఖీలు.. 38 వాహనాలు స్వాధీనం

**నల్లగొండ, జులై 15 ( అన్వేషనేత్రం ప్రతినిధి ):**

జిల్లాలో నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ, అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలపై నిఘా మరింత బలోపేతం చేయాలనే ఉద్దేశంతో మిర్యాలగూడ పట్టణంలో బుధవారం తెల్లవారుజామున పోలీసులు విస్తృత స్థాయిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. జిల్లా పోలీసు అధికారి శరత్ చంద్ర పవార్ ఆదేశాల మేరకు చేపట్టిన ఈ ప్రత్యేక తనిఖీలను మిర్యాలగూడ ఇన్‌చార్జి ఉప పోలీసు అధికారి రవి పర్యవేక్షించారు. ఒకటో పట్టణ పోలీసు అధికారి నాగభూషణ్, రెండో పట్టణ పోలీసు అధికారి సోమ నర్సయ్య, గ్రామీణ పోలీసు అధికారి పి.ఎన్.డి. ప్రసాద్ ఆధ్వర్యంలో ఎనిమిది ప్రత్యేక బృందాలు ఏర్పడి పట్టణంలోని ప్రధాన కూడళ్లు, జాతీయ రహదారులు, ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు, రద్దీ ప్రాంతాలు, అనుమానాస్పద ప్రాంతాల్లో ఏకకాలంలో తనిఖీలు చేపట్టాయి. తనిఖీల సందర్భంగా వాహనాల నమోదు ధ్రువీకరణ, నంబర్ పలకలు, డ్రైవింగ్ అనుమతిపత్రం, నమోదు ధ్రువపత్రం తదితర పత్రాలను పరిశీలించారు. నిబంధనలకు విరుద్ధంగా నంబర్ పలకలు లేకుండా తిరుగుతున్న 11 ద్విచక్ర వాహనాలతో పాటు అవసరమైన పత్రాలు లేని మరో 27 వాహనాలను గుర్తించి మొత్తం 38 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. సంబంధిత యజమానులపై మోటారు వాహనాల చట్టం ప్రకారం కేసులు నమోదు చేసి తదుపరి చర్యలు ప్రారంభించారు. అనుమానాస్పదంగా సంచరిస్తున్న వ్యక్తులను నిలిపి వివరాలు సేకరించడంతో పాటు వారి కదలికలను పరిశీలించారు. రాత్రివేళల్లో నేరాలకు పాల్పడే అవకాశమున్న వ్యక్తులపై ప్రత్యేక నిఘా కొనసాగించగా, పాత నేరస్థుల కార్యకలాపాలపైనా ఆరా తీశారు. ఈ సందర్భంగా ఉప పోలీసు అధికారి రవి మాట్లాడుతూ ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ పోలీసు శాఖ ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. చట్టాలను ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహనదారులు తప్పనిసరిగా నిబంధనలకు అనుగుణమైన నంబర్ పలకలు ఏర్పాటు చేసుకుని, నమోదు ధ్రువపత్రం, బీమా, డ్రైవింగ్ అనుమతిపత్రం తదితర పత్రాలను వెంట ఉంచుకోవాలని సూచించారు. మిర్యాలగూడ పట్టణంలో ఇలాంటి ఆకస్మిక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, అనుమానాస్పద వ్యక్తులు లేదా ఘటనలపై ప్రజలు వెంటనే పోలీసులకు సమాచారం అందించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.






# మాదకద్రవ్య రహిత భారతానికి సమష్టి కృషే మార్గం

## చదువు, క్రీడల్లో రాణిస్తేనే ఉజ్వల భవిష్యత్: అదనపు ఎస్పీ జి. రమేష్

**నల్గొండ, జూలై 15 ( అన్వేషనేత్రం ప్రతినిధి):**

మాదకద్రవ్య రహిత సమాజ నిర్మాణానికి ప్రభుత్వం, విద్యాసంస్థలు, తల్లిదండ్రులు, పౌరులు సమన్వయంతో కృషి చేయాలని నల్గొండ జిల్లా అదనపు పోలీసు అధికారి జి. రమేష్ పిలుపునిచ్చారు. కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని కేంద్ర సమాచార ప్రసార విభాగం నిర్వహించిన 'నషా ముక్త్ భారత్ అభియాన్' అవగాహన కార్యక్రమం బుధవారం నల్గొండ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న అదనపు ఎస్పీ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడలు, ఇతర అభిరుచి రంగాల్లోనూ ప్రతిభ కనబరచాలని సూచించారు. చెడు స్నేహాలకు దూరంగా ఉండి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చేలా కష్టపడి చదవాలని, వివిధ రంగాల్లో ఉన్నత స్థానాలు సాధించిన వారిని ఆదర్శంగా తీసుకుని లక్ష్యసాధన దిశగా ముందుకు సాగాలని చెప్పారు. ఆరోగ్యవంతమైన, సురక్షితమైన, మాదకద్రవ్య రహిత సమాజ నిర్మాణమే 'నషా ముక్త్ భారత్ అభియాన్' లక్ష్యమని రమేష్ పేర్కొన్నారు. అవగాహన, ముందస్తు నివారణ, సరైన నిర్ణయాల ద్వారానే మాదకద్రవ్యాల వ్యసనాన్ని సమర్థంగా అరికట్టవచ్చని చెప్పారు. వ్యసనానికి బానిసైన వారికి అండగా నిలిచి,







పునరావాసం కల్పించి గౌరవప్రదమైన జీవితానికి దోహదపడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. మాదకద్రవ్యాల నిర్మూలనలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని, సమష్టి కృషితోనే ఆశించిన ఫలితాలు సాధ్యమవుతాయని స్పష్టం చేశారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కేంద్ర సమాచార ప్రసార విభాగం సహాయ సంచాలకుడు జి. కోటేశ్వరరావు స్వాగతం పలికారు. ప్రత్యేక అతిథిగా పాల్గొన్న తెలంగాణ ఈగల్ దళం ఉప పోలీసు అధికారి శంకర్ యాదవ్ మాట్లాడుతూ రాష్ట్రంలో మాదకద్రవ్యాల నియంత్రణకు పోలీసులు చేపడుతున్న చర్యలను వివరించారు. నిరంతర నిఘాతో పాటు ఉచిత సహాయ సంఖ్య 1908కు ప్రజలు అందిస్తున్న సమాచారంతో రాష్ట్రవ్యాప్తంగా అక్రమ మాదకద్రవ్యాల ముఠాలను గుర్తించి నిర్మూలించడంలో మంచి ఫలితాలు సాధిస్తున్నామని తెలిపారు. అక్రమ మాదకద్రవ్యాల రవాణా దేశ యువతకు తీవ్రమైన ముప్పుగా మారిందని, ముఖ్యంగా విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని ముఠాలు కార్యకలాపాలు సాగిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో విద్యార్థులు, ప్రజల్లో విస్తృత స్థాయిలో అవగాహన కల్పించడం అత్యవసరమని అన్నారు. 'నషా ముక్త్ భారత్ అభియాన్' మూడు ప్రధాన లక్ష్యాలతో కొనసాగుతోందని శంకర్ యాదవ్ తెలిపారు. మాదకద్రవ్యాల వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవడం, ప్రజల్లో అవగాహన పెంపొందించడం, వ్యసనగ్రస్తులకు విముక్తి కల్పించి పునరావాసం అందించడం ఇందులో ముఖ్యమైన అంశాలని వివరించారు. మాదకద్రవ్య రహిత భారత నిర్మాణంలో ప్రతి పౌరుడు అప్రమత్తంగా ఉంటూ ప్రభుత్వ చర్యలకు సహకరించాలని, విద్యార్థులు తెలంగాణ ఈగల్ దళంలో స్వచ్ఛంద సేవకులుగా చేరాలని పిలుపునిచ్చారు. మైభారత్ (నెహ్రూ యువ కేంద్రం) జిల్లా యువజన అధికారి ఎం. గౌతం రెడ్డి మాట్లాడుతూ అంతర్జాల, సైబర్ నేరాలతో పాటు మాదకద్రవ్యాల వ్యసనం యువతకు, కుటుంబాలకు, దేశ భవిష్యత్తుకూ సవాలుగా మారిందన్నారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ ఉత్తమ వ్యక్తిత్వాన్ని పెంపొందించుకోవాలని, తోటి విద్యార్థుల్లోనూ అవగాహన కల్పించాలని సూచించారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రధానాచార్యులు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మాదకద్రవ్యాల వ్యతిరేక ప్రచారంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై ఇక్కడ తెలుసుకున్న విషయాలను కుటుంబ సభ్యులకు, సమాజానికి చేరవేయాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు అదనపు ఎస్పీ జి. రమేష్ ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు. పోలీసు కళాబృందం, యక్షగాన బృందం ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అధ్యాపకులు విద్యాసాగర్, అజయ్, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


# జూలై 16 నుంచి ఆగస్టు 13 వరకు హైదరాబాద్ నగరంలో ఆషాడం బోనాల ఆధ్యాత్మిక శోభ

జూలై.16.గోల్కొండ శ్రీ జగదాంబిక అమ్మవారి బోనాలు
జులై.19. సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయిని మహంకాళి మహోత్సవం
జూలై.26.బల్కంపేట శ్రీ ఎల్లమ్మ అమ్మవారి బోనాలు..
ఆగస్టు.2. సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాలు.
ఆగస్టు.9.పాతబస్తీ లాల్ దర్వాజా శ్రీ సింహవాహిని అమ్మవారి బోనాలు..
.ఆగస్టు.10. రంగం కార్యక్రమం మరియు గటాల ఊరేగింపు.. అమ్మవారి ఆశీస్సులు సదా మన అందరిపై కలిగి ఉండాలని మనసారా కోరుకుంటూ ఈ బోనాల పండుగ ప్రతి ఒక్కరూ ఆనందోత్సవాలతో సంతోషంగా జరుపుకోవాలి అని మనసారా కోరుకుంటున్నాను
మీ
శ్రీమతి చింతల నిర్మల గోవర్ధన్ రెడ్డి గారు.
తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ మహిళ వైస్ ప్రెసిడెంట్



RNI.No. TELTEL/2010/32434
అన్వేషనేత్రం
ఎడిటర్ : గోల్ల రమేష్
తెలుగు దినపత్రిక

## ఆట



# సంజూ శాంసన్ తీవ్రమైన ఒత్తిడి



ఇండియా స్టార్ వికెట్ కీపర్ బ్యాటర్ సంజూ శాంసన్ ప్రెజెంట్ కెరీర్ లోనే మోస్ట్ డిఫికల్ట్ ఫేజ్ ను ఫేస్ చేస్తున్నాడు. టీమిండియా మేనేజ్‌మెంట్ అతనిపై నమ్మకం ఉంచినప్పటికీ, బయట నుంచి వస్తున్న విమర్శలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. లాస్ట్ మూడు ఇన్నింగ్స్‌లలో 5, 0, 1 రన్స్ మాత్రమే చేసి దారుణంగా ఫెయిల్ అవ్వడం శాంసన్ పొజిషన్ ను రిస్క్ లో పడేసింది. ఐర్లాండ్‌తో జరిగిన రెండు మ్యాచ్ లతో పాటు ఇంగ్లాండ్‌తో జరిగిన ఫస్ట్ టీ20 మ్యాచ్ లోనూ అతను పూర్తిగా నిరాశపరిచాడు. ఇదే టైమ్‌లో 15 ఏళ్ల బ్యాటింగ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీ ప్లేయింగ్ ఎలెవన్ లో ఛాన్స్ కోసం వెయిట్ చేస్తుండటంతో శాంసన్ పై ప్రెజర్ నెక్స్ట్ లెవెల్ కు చేరింది. ఈ నేపథ్యంలో ఇండియా మాజీ లు సంజూ శాంసన్ బ్యాటింగ్ లో ఉన్న ఒక మేజర్ టెక్నికల్ లోపాన్ని ఎక్స్ పోజ్ చేశారు.సంజూ శాంసన్ ను అవుట్ చేయడానికి బౌలర్లు ఎలాంటి ప్లాన్ ఫాలో అవుతున్నారో నిపుణులు క్లియర్ గా ఎక్స్ ప్లెయిన్ చేస్తున్నారు. సంజూ బ్యాటింగ్ చేసేటప్పుడు అతని బ్యాట్ ఫేస్ కంప్లీట్‌గా క్లోజ్ అయి ఉంటుందని, అందుకే బౌలర్లు బాల్ ను ఆఫ్ స్టంప్ కు వెలుపల వేయడానికి ట్రై చేస్తున్నారని అంటున్నారు. క్లోజ్డ్ బ్యాట్ ఫేస్ తో ఉన్నప్పుడు అతను ఆఫ్ సైడ్ షాట్లు ఆడటానికి ప్రయత్నించినప్పుడు బ్యాట్ ఫేస్ ఒక్కసారిగా ఓపెన్ అవుతుందని, ఈ టెక్నికల్ ఫ్లా వల్లే అతను వికెట్లు పారేసుకుంటున్నాడని మాజీ ఆల్ రౌండర్ ఇర్ఫాన్ పఠాన్ స్పష్టం చేశాడు. ఐర్లాండ్ తో జరిగిన ఫస్ట్ మ్యాచ్ లో బాల్ ను ఆన్ ది అప్ ఆడబోయి ఇన్‌సైడ్ ఎడ్జ్ తో క్లీన్ బౌల్డ్ అయ్యాడని, ఇంగ్లాండ్ పై జరిగిన మ్యాచ్ లోనూ ఆఫ్ స్టంప్ అవతలి బాల్ ను అనవసరంగా కెలుక్కుని థర్డ్ మ్యాన్ లో క్యాచ్ ఇచ్చాడని పఠాన్ విశ్లేషించాడు.మరో ఎండ్ లో బిహార్ కు చెందిన 15 ఏళ్ల వండర్ కిడ్ వైభవ్ సూర్యవంశీ ఇంటర్నేషనల్ డెబ్యూ కోసం క్రికెట్ లోకమంతా ఈగర్‌గా వెయిట్ చేస్తోంది. ఐపీఎల్ 2026 సీజన్ లో రాజస్థాన్ రాయల్స్ తరఫున ఆడిన వైభవ్, ఏకంగా 237.30 మైండ్ బ్లోయింగ్ స్ట్రైక్ రేట్‌తో 776 రన్స్ స్కోర్ చేసి 'ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్' అవార్డును సొంతం చేసుకున్నాడు. ఐర్లాండ్ టూర్ లో ఇండియా 0-2 తో ఘోరంగా ఓడినప్పుడు అతనికి ఒక్క ఛాన్స్ కూడా ఇవ్వకపోవడంపై ఫ్యాన్స్ ఫుల్ ఫైర్ లో ఉన్నారు. ప్రెజెంట్ ఇంగ్లాండ్‌తో జరుగుతున్న ఫైవ్-మ్యాచ్ టీ20 సిరీస్ లోనైనా అతనికి డెబ్యూ క్యాప్ దక్కుతుందని అందరూ ఆశిస్తున్నారు. మాజీ క్రికెటర్ సబా కరీం మాట్లాడుతూ.. ఐపీఎల్ హిస్టరీలోనే విరాట్ కోహ్లీ ఒక సీజన్ లో భారీగా రన్స్ కొట్టిన రికార్డ్ తర్వాత, మళ్లీ ఆ రేంజ్ లో ఇంపాక్ట్ చూపించిన ఏకైక సీజన్ వైభవ్ సూర్యవంశీదేనని కొనియాడాడు. యంగ్ స్టార్ వైభవ్ సూర్యవంశీ బ్యాటింగ్ ఎబిలిటీ పై సబా కరీం నెక్స్ట్ లెవెల్ కాన్ఫిడెన్స్ చూపించాడు. వరల్డ్ క్లాస్ బౌలర్లను సైతం డొమెస్టిక్ కండిషన్స్ లో వైభవ్ ఊచకోత కోశాడని, కేవలం ఇండియన్ ఫ్యాన్స్ మాత్రమే కాదు వరల్డ్ వైడ్ గా ఉన్న క్రికెట్ లవర్స్ అందరూ అతని విధ్వంసకర బ్యాటింగ్ ను ఇంటర్నేషనల్ లెవెల్ లో చూడటానికి ఆత్రుతగా ఉన్నారని చెప్పాడు. "ఈ యంగ్ లాడ్ పై నాకు చాలా హై హోప్స్ ఉన్నాయి. చాలా త్వరలోనే వైభవ్ ఇండియా తరఫున టెస్ట్, వన్డే, టీ20 లాంటి ఆల్ త్రీ ఫార్మాట్లలో కీ ప్లేయర్ గా మారబోతున్నాడు, ఇందులో ఎలాంటి డౌట్ లేదు" అని సబా కరీం స్పష్టం చేశాడు. సంజూ శాంసన్ తన తప్పులను సరిదిద్దుకోకపోతే ఇంగ్లాండ్ సిరీస్ లోనే అతని ప్లేస్ లో వైభవ్ ఓపెనర్‌గా రావడం ఖాయమని విశ్లేషకులు అంటున్నారు.



# మెదక్‌పై నల్గొండ ఘన విజయం

నురాగ్ నల్గొండ నైట్స్ గెలుపు ట్రాక్ ఎక్కింది. గత మ్యాచ్?లో ఖమ్మం చేతిలో ఓడిన నల్గొండ, తాజాగా మెదక్?ను చిత్తు చేసింది. ఉప్పల్ వేదికగా శుక్రవారం జరిగిన మ్యాచ్?లో మెదక్?పై నల్గొండ 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. మెదక్ నిర్దేశించిన 181 పరుగుల టార్గెట్?ను నల్గొండ 16.3 ఓవర్లలోనే ఛేదించింది. ఓపెనర్ గౌరవ్ రెడ్డి (101 నాటౌట్) సెంచరీతో ఆకట్టుకున్నాడు. జశ్వంత్ మోతె (34 పరుగులు) ఫర్వాలేదనిపించాడు. మెదక్ బౌలర్లలో అర్జున్, మధుకర్ చెరో 1 వికెట్ పడగొట్టారు. ఓ మోస్తారు ఛేదనను నల్గొండ ఘనంగానే ఆరంభించింది. గౌరవ్ రెడ్డి తొలి నుంచే దూకుడుగా ఆడడంతో పవర్ ప్లేలోనే భారీగా పరుగులు వచ్చాయి. జస్వంత్ కూడా ఆకట్టుకున్నాడు ఈ ఇద్దరు తొలి వికెట్?కు 40 బంతుల్లోనే 83 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. 6.4 ఓవర్ వద్ద జస్వంత్ ఔట్ అయ్యాడు. అయినా గౌరవ్ జోరు తగ్గలేదు. బౌండరీలు బాదుతూ స్కోర్ బోర్డును పరుగులు పెట్టించాడు. వన్? డౌన్?లో వచ్చిన నితీశ్ (21) స్వల్ప స్కోరుకే మధుకర్ బౌలింగ్?లో 12.2 వద్ద ఔటయ్యాడు. కానీ అప్పటికే నల్గొండ గెలుపు ఖాయమైంది. చివర్లో సెంచరీతోపాటు గౌరవ్ మ్యాచ్?ను కూడా ముగించాడు. అంతకుముందు బ్యాటింగ్ చేసిన మెదక్ ఫాల్కన్స్? 20 ఓవర్లలో నాలుగు వికెట్లు కోల్పోయి 180 పరుగులు చేసింది. విక్రమ్ నాయక్ (48 పరుగులు నాటౌట్), వరుణ్ ఎర్రమ్ (44 పరుగులు) రాణించారు. శ్రుంజిత్ రెడ్డి (30 పరుగులు), తెలుకుపల్లి రవితేజ (33 పరుగులు) ఫర్వాలేదనిపించారు. నల్గొండ బౌలర్లలో ఇయాన్ సతాని, చింతల రక్షన్ రెడ్డి, అనికేత్ రెడ్డి తలో 1 వికెట్ దక్కించుకున్నారు. తాజా ఓటమితో మెదక్ టీజీ 20 లీగ్ ప్లేఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమించింది! ఇప్పటిదాకా ఆరు మ్యాచ్?లు ఆడిన ఆ జట్టు కేవలం ఒకే దాంట్లో నెగ్గింది. మిగిలిన ఐదు మ్యాచ్?ల్లోనూ ఓడిపోయి పాయింట్ల పట్టికలో అట్టడుగున ఉంది. మరోవైపు, నల్గొండ నాలుగో విజయంతో రెండో స్థానంలోకి దూసుకెళ్లింది. ఇప్పటిదాకా ఆరు మ్యాచ్?లు ఆడిన నల్గొండ రెండు ఓటములు, నాలుగు విజయాలు 8 పాయింట్లతో ప్లేఆఫ్స్?కు దగ్గరైంది. ఇక ఆడిన ఐదు మ్యాచ్?ల్లోనూ నెగ్గిన హైరదాబాద్ ఈ ఛాంపియన్స్ 10 పాయింట్లతో టాప్?లో ఉంది.

RNI.No. TELTEL/2010/32434
అన్వేషనేత్రం
ఎడిటర్ : గోల్ల రమేష్
తెలుగు దినపత్రిక

## సినిమా
CINEMA



# 24న రామాయణ ట్రైలర్ విడుదల

భారతీయ చిత్ర పరిశ్రమ చరిత్రలోనే భారీ స్థాయిలో తెరకెక్కుతున్న చిత్రం 'రామాయణ'. విడుదలకు ముందే ఈ సినిమాపై దేశవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది. ఈ ఏడాది అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రాలలో ఇదీ ఒకటి. ఈ మూవీలో రాముడిగా బాలీవుడ్ నటుడు రణ్‌బీర్ కపూర్, సీతగా సాయి పల్లవి నటిస్తున్నారు. నితీశ్ తివారీ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ చిత్రం రెండు భాగాలుగా విడుదల కానుంది. తాజాగా చిత్రబృందం ఈ సినిమా ట్రైలర్ విడుదల తేదీని ప్రకటించింది. జులై 24న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేయనున్నట్లు ఇన్‌స్టా వేదికగా వెల్లడించింది. కొన్ని వేల సంవత్సరాలుగా ధర్మం, మర్యాద, ధైర్యం, కరుణ అనే ఆదర్శాలతో 'రామాయణం' ఎన్నో తరాలకు స్ఫూర్తినిచ్చింది. మన నాగరికతకు అద్దం పట్టే ఈ గొప్ప ఇతిహాసాన్ని ప్రపంచానికి సరికొత్తగా పరిచయం చేయబోతున్నాం అని ఇన్‌స్టాలో చిత్రబృందం పోస్ట్ చేసింది. ఈ చిత్రంలో రణ్‌బీర్ కపూర్, సాయిపల్లవితో పాటు పలువురు అగ్ర తారలు కీలక పాత్రలు పోషిస్తున్నారు. భారీ బడ్జెట్‌తో ఈ సినిమా తీస్తున్నట్లు నిర్మాత నమిత్ మల్హోత్రా తెలిపారు.

# ఓ సుకుమారి ట్రైలర్ విడుదల

'మసూద', 'పరేషాన్' చిత్రాలతో వైవిధ్యమైన నటుడిగా గుర్తింపు తెచ్చుకున్న తిరువీర్, టాలెంటెడ్ బ్యూటీ ఐశ్వర్య రాజేష్ ప్రధాన పాత్రల్లో నటించిన లేటెస్ట్ మూవీ 'ఓ సుకుమారి'. భరత్ దర్శన్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ ఫీల్ గుడ్ మ్యూజికల్ లవ్ అండ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ అధికారిక ట్రైలర్ తాజాగా విడుదలైంది. ఒక అందమైన గ్రామీణ నేపథ్యంలో సాగే స్వచ్ఛమైన ప్రేమకథ, ఆ తర్వాత వారి జీవితాల్లో వచ్చే మలుపుల చుట్టూ ఈ సినిమా కథ తిరుగుతుందని ట్రైలర్ చూస్తే అర్థమవుతోంది. తిరువీర్ తన మార్క్ సహజ నటనతో ఆకట్టుకోగా, ఐశ్వర్య రాజేష్ మరోసారి నటన ప్రాధాన్యమున్న పాత్రలో మెరిశారు. భరత్ మంచిరాజు అందించిన స్వరాలు, నేపథ్య సంగీతం ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి.






# మురుగన్ నేపథ్యంలో చిత్రాల నిర్మాణం

దక్షిణాది సినీ పరిశ్రమలో దైవిక, పురాణ గాథల నేపథ్యానికి నయా క్రేజ్ మొదలైంది. ఒకప్పుడు పౌరాణిక కథలకు కేరాఫ్ అడ్రస్‌గా కోలీవుడ్, టాలీవుడ్ ఇండస్ట్రీలు మళ్లీ అదే బాట పట్టినట్లు తెలుస్తున్నాయి. ప్రస్తుతం తమిళ, తెలుగు సినీ రంగాలలో లార్డ్ మురుగన్ (సుబ్రమణ్య స్వామి) కాన్సెప్ట్ ఒకవైపు భారీ ట్రెండ్‌గా మారుతోంది. టాలీవుడ్, కోలీవుడ్ ప్రముఖ దర్శకులు, అగ్ర హీరోలు మురుగన్ బ్యాక్‌డ్రాప్‌లో ప్రతిష్టాత్మక చిత్రాలను ప్రకటించడం సోషల్ మీడియా వ్యాప్తంగా పెను సంచలనం సృష్టిస్తోంది. ఈ ట్రెండ్‌ను మొదటిగా కోలీవుడ్ హీరో శివకార్తికేయన్ ప్రారంభించాడు అని చెప్పవచ్చు. శివకార్తికేయన్ పుట్టినరోజు పురస్కరించుకుని విడుదలైన ఒక గ్లింప్స్ ఇటీవలే అందరి దృష్టిని ఆకర్షించింది. శివకార్తికేయన్ ప్రధాన పాత్రలో లోకనాయకుడు కమల్ హాసన్ భారీ నిర్మాణంలో, శివకుమార్ మురుగేశన్ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న 'సేయోన్' అనే చిత్రం ఈ మురుగన్ సెంటిమెంట్‌కు పునాది వేసింది. తమిళ ప్రాచీన సంస్కృతి, సాహిత్యంలో కార్తికేయుడిని 'సేయోన్' అని పిలుస్తారు. ఈ చిత్ర గ్లింప్స్‌లో శివకార్తికేయన్ విరుమాండి స్వామి పూనకం వచ్చినట్లుగా, అత్యంత ఊరమాస్ లుక్‌లో పల్లెటూరి జాతర నేపథ్యంలో కనిపించి అభిమానులను అలరించారు. సంతోష్ నారాయణన్ సంగీతం అందిస్తున్న ఈ యాక్షన్ డ్రామాను అక్టోబర్ లో గ్రాండ్‌గా విడుదల చేయడానికి చిత్ర యూనిట్ సన్నాహాలు చేస్తోంది. జూనియర్ ఎన్టీఆర్ మరియు మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో ఒక భారీ పాన్-ఇండియా ప్రాజెక్ట్ అనౌన్స్ అయింది. ఈ చిత్రానికి 'గాడ్ ఆఫ్ వార్' అనే టైటిల్ విస్తృతంగా ప్రచారంలో ఉంది. దీంతో ఈ ప్రాజెక్ట్ కూడా మురుగన్ జీవితంపై రాబోతుండడంతో టాలీవుడ్ అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. మరోవైపు ఈ సినిమా ప్రకటన సమయంలో నిర్మాత నాగవంశీ సోషల్ మీడియాలో పెట్టిన ఒక పోస్ట్ తీవ్ర వివాదానికి దారితీసింది. మురుగన్ స్వామి 'ఉత్తరాదిన జన్మించాడు..

Printed Published and owned by Golla Ramesh, No.8-4-111, NG. Colony, Ramagiri, Nalgonda-508001 Telangana State, Printed at Prabhu publication H.No.6-4-111. NC Colony Ramaghir, Nalgonda-508001 Telangana State Publisheds H.No.6-4-111. NG. Colony, Ramagiri, Netponde-508001 Telanagan Stsos, Editor T Golla RN.No. TELTEL/201002434